

చావు మలుపులు..!



మూడు రోజుల కిందట తనకల్లు మండలం మండ్లిపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన వాహనాలు

కదిరి నుంచి చీకటిమానుపల్లి వరకు అనేక మలుపులు

ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు

రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరిస్తే తగ్గే అవకాశం

కదిరి/ తనకల్లు/ నల్లచెరువు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కదిరి నుంచి, చీకటిమానుపల్లి వరకు ఉన్న జాతీయ రహదారి మలుపులు అనేక ప్రమాదాలకు కారణమవుతున్నాయి. దీంతో ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. కదిరి నుంచి చీకటిమానుపల్లి వరకు దాదాపు 35 కిలోమీటర్ల పరిధిలో చాలా డీప్ కర్వులు ఉన్నాయి. ఈమలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తీవ్ర ప్రమాదాలు జరుగుతున్నాయి. అతి రద్దీగా ఉండే ఈ జాతీయ రహదారిని నాలుగే లేన్లుగా విస్తరిస్తే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని స్థానిక ప్రజలు చెబుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదాలు

కదిరి నుంచి జిల్లా సరిహద్దుగా ఉన్న తనకల్లు మండలంలోని చీకటిమానుపల్లి వరకు అనేక మలుపులున్నాయి. ఈమలుపుల్లో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడంలేదు. ముఖ్యంగా నల్లచెరువు మండలంలోని పెద్దయల్లంపల్లి వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు పూర్తిగా కనిపించవు. ఈమలుపు వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే పాత రైల్వేస్టేషన్ వద్ద కూడా ఇదే పరిస్థితి. గతంలో నల్లచెరువు సాయిబాబా గుడి వద్ద మలుపులో జరిగిన ప్రమాదంలో 11మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. తనకల్లు మండలంలోని పరాకువాండ్లపల్లి, మండ్లిపల్లి, నల్లగుట్లపల్లి, గంగసానిపల్లి, కొక్కంటిక్రాస్ పెట్రోల్ బంక్, చీకటిమానుపల్లి వద్ద ప్రమాదకరమైన మలుపులున్నాయి. రాత్రి సమయంలో వాహనం దగ్గరికి వచ్చే వరకు గుర్తించే పరిస్థితి లేదు. దీంతో దగ్గరికి వచ్చిన సమయంలో వాహనాలను డ్రైవర్లు అదుపు చేయలేక ప్రమాదాలు జరుగుతున్నాయి.



నల్లచెరువు రాగన్నగారిపల్లి వద్ద ప్రమాదం

కొన్ని ఉదాహరణలు ఇలా..

- తనకల్లు మండలంలో జాతీయ రహదారి మలుపుల కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.
- పరాకువాండ్లపల్లి సమీపంలో రోడ్డు మలుపు ఉండటంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. గత మూడునెలల్లో మూడుమార్లు ప్రమాదాలు జరిగాయి.
- మండ్లిపల్లి మిట్ట, మండ్లిపల్లి సమీపంలో రోడ్డు మలుపుల వల్ల గత మూడు నెలల్లో ఐదు ప్రమాదాలు జరిగి నలుగురు మృతి చెందారు.
- మండలంలోని గంగసానిపల్లి, నారేవాండ్లపల్లి మధ్య రెండునెలల కిందట జరిగిన ప్రమాదంలో నల్లమాడకు చెందిన కూలీలు మృతి చెందారు. చీకటిమానుపల్లి, ఈదులవంక మధ్యలో మూడునెలలో నాలుగురు ద్విచక్రవాహనదారులు మృతి చెందారు.



నల్లచెరువు ఎర్రగుట్టపల్లి మలుపు వద్ద ప్రమాదం

- నల్లచెరువు మండలంలోని పెద్దయల్లంపల్లి మలుపు వద్ద ఈ ఏడాది మే 11న ఆగి ఉన్న ఐషర్ వాహనాన్ని ఓ కారు ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు రిటైర్డ్ ఉద్యోగులు మృతి చెందారు.
- పాత రైల్వేస్టేషన్ మలుపు వద్ద ఈనెల 17న ఆటోను కారు ఢీకొంది. దీంతో ఓ వ్యక్తి మృతి చెందాడు.
- సంత తోపు వద్ద కర్ణాటక రాష్ట్రంలోని చింతామణికి చెందిన బొలెరో వాహనం ఈనెల 7న గ్యాస్ లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు.

రోడ్డు వెడల్పే మార్గం

ఈ మలుపుల్లో ప్రమాదాలను నివారించాలంటే రోడ్డు వెడల్పు ఒక్కటే మార్గమని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. మలుపుల వద్ద అడ్డగా ఉన్న చెట్లను తొలగించి, రోడ్డును వెడల్పు చేసి, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటితోపాటు నాలుగు లేన్ల రోడ్డు ఏర్పాటు చేస్తే ప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చని పలువురు వాహన డ్రైవర్లు చెబుతున్నారు. ఇప్పటికే అన్నమయ్యజిల్లాలోని మొలకలచెరువు నుంచి తిరుపతి వరకు నాలుగులేన్ల రోడ్డు ఏర్పాటు చేశారు. ఇక్కడ కూడా రోడ్డును విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీసు స్టేషన్

ఖాళీ..!

నంబులపూలకుంటలో తీవ్రంగా సిబ్బంది కొరత



నంబులపూలకుంట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు స్టేషన్ అత్యంత కీలకమైనది. కడప, అన్నమయ్య జిల్లాలతో మండలం సరిహద్దు పంచుకుంటోంది. ఎర్రచందనం రవాణా జోరుగా సాగుతుంటుంది. పేకాట కూడా అదేస్థాయిలో ఆడుతుంటారు. మండలం మీదుగా రేషన్ బియ్యం కర్ణాటకకు అధికంగా తరలిస్తుంటారు. సోలార్ హబ్‌లు కూడా ఉన్నాయి. అంతటి కీలకమైన మండలంలో పోలీసు స్టేషన్‌లో సిబ్బంది కొరత ఏర్పడింది. సిబ్బంది కొరత తీవ్రమైంది. ఎస్ఐతో కలిసి 22 మంది ఉండాల్సి ఉండగా.. ఐదుగురే ఉన్నారు. వారిలో కూడా ఎస్ఐ విధి నిర్వహణలో భాగంగా ఇతర ప్రాంతానికి వెళ్లారు. ఏఎస్ఐ సెలవులో ఉన్నారు. హెడ్, మహిళా కానిస్టేబుల్ ఉన్నారు. మహిళా కానిస్టేబుల్ కంప్యూటర్ విధులకే పరిమితమవుతున్నారు. మహిళా పోలీసు ఒకరున్నారు. దీంతో శాంతిభద్రతల పరిరక్షణ కష్టంగా మారింది.

22 మందికిగాను..

నంబులపూలకుంట పోలీసు స్టేషన్‌లో ఎస్ఐతోపాటు, ఇద్దరు ఏఎస్ఐలు, నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 15మంది సిబ్బంది విధులు నిర్వర్తించాల్సి ఉంది. ప్రస్తుతం ఐదుగురే ఉన్నారు. వారిలో కూడా ఎస్ఐ కేసు దర్యాప్తులో భాగంగా రెండు వారాల క్రితం ఇతర రాష్ట్రాలకు వెళ్లారు. ఎస్ఐ కుమారుడి వివాహానికి సెలవు పెట్టారు. ఉన్న హెడ్ కానిస్టేబుల్ కోర్టు పనిమీద వెళ్తే మహిళా కానిస్టేబుల్ మాత్రమే ఉంటారు. 24 గంటలు స్టేషన్‌లో ఉండేందుకు కూడా ఎవరూలేని దుస్థితి. ఈ పరిస్థితుల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగితే ఎట్లాగని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు.. పోలీసు స్టేషన్‌కు చాలినంత మంది సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

యూరియా కొరత లేదు

- రైతులు ఆందోళన చెందవద్దు
- కలెక్టర్ టీఎస్ చేతన్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత లేదనీ, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో యూరియా కొరతపై అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా సరఫరా చేస్తామన్నారు. 4,700 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. యూరియాను వ్యవసాయేతర అవసరాలకు మళ్లించినా, కృత్రిమ కొరత సృష్టించినా, డీలర్లు అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి సుబ్బారావు, డీఎస్ఓ వంశీకృష్ణారెడ్డి, రవాణా శాఖ ఉదయ్‌కుమార్, కార్మిక శాఖాధికారి సూర్యనారాయణ, పశు సంవర్ధక శాఖ జేడీ శుభదాస్ పాల్గొన్నారు.

మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలి

- సెర్ప్ సీఈఓ వాకాటి కరుణ



సమావేశంలో మాట్లాడుతున్న సెర్ప్ సీఈఓ వాకాటి కరుణ

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి వెలుగు సిబ్బంది శక్తివంచన లేకుండా కృషిచేయాలని సెర్ప్ సీఈఓ వాకాటి కరుణ పేర్కొన్నారు. పుట్టపర్తిలోని షాదీమహల్‌లో బుధవారం ఉమ్మడి అనంతపురం జిల్లా వెలుగు సిబ్బంది, అధికారులతో ప్రాజెక్టులో అమలవుతున్నా కార్యక్రమాలు, సాధించిన ప్రగతి, ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ.. వెలుగు సిబ్బంది.. మహిళా సాధికారతకు కృషి చేయాలన్నారు. పారిశ్రామిక రంగంలో అవకాశాలను గుర్తించి, మహిళలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో సెర్ప్ ఉన్నతి డైరెక్టర్ శివశంకర్ ప్రసాద్, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లు నరసయ్య, శైలజ, డీపీఎంలు, ఏపీఎంలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అయోమయ పరీక్షలు..!

1 నుంచి 8 తరగతుల విద్యార్థుల్లో గందరగోళం

- జవాబులు రాయలేక ఆపసోపాలు
- మూల్యాంకనం చేయలేక ఉపాధ్యాయుల అవస్థలు



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

ధర్మవరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పరీక్షల విధానంలో విద్యాశాఖ తీసుకు వచ్చిన నూతన విధానం అయోమయంగా మారింది. ఈ నెల 11 నుంచి 14వతేదీ వరకు నిర్వహించిన ఫార్మేటివ్ అసెస్‌మెంట్(ఎఫ్ఏ) పరీక్షలలో పాఠశాల విద్యాశాఖ చేసిన ప్రయోగాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాలతో రూపొందించిన ప్రశ్నపత్రాలకు అనుగుణంగా జవాబులు రాయడంలో విద్యార్థులు తెల్లమొహాలు వేశారు. జవాబు పత్రాలను మూల్యాంకనం చేసే టీచర్లకు కూడా చాలా వరకు ప్రశ్నలు అర్థం కాకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. పరీక్షలంటే రెండు రావుల తెల్లకాగితాలపై జవాబులు రాసే విధానానికి స్వస్తి పలికి బుక్‌లెట్లు ముద్రించి ఏడాది పొడవునా అన్ని పరీక్షలు అందులోనే రాసుకునేందుకు విద్యాశాఖ వీలు కల్పించింది. దీంతో టీచర్లంతా సంతోషించారు. ఏడాది పాటు విద్యార్థి సామర్థ్యం అంచనా వేయడానికి ఇది ప్రామాణికంగా నిలుస్తుందని భావించారు. ప్రశ్నపత్రాలను పూర్తిగా మార్చేయడంతో ముఖ్యంగా ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు విద్యార్థులు (మిగతా 6లో..)

బస్సులు కిటకిట

పెరిగిన స్త్రీశక్తి



కొత్తచెరువులో బస్సు ఎక్కుతున్న మహిళలు

కొత్తచెరువు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో బస్సులు కిటకిటలాడుతున్నాయి. పథకం ప్రారంభించిన 15 నుంచి 19 వతేదీ వరకు జిల్లాలో 1,83,837 మంది మహిళలు ఉచిత ప్రయాణం చేసినట్లు జిల్లా రవాణా శాఖ రీజనల్ మేనేజర్ మధుసూదన్ తెలిపారు. విద్యార్థినులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు వివిధ సంస్థలలో పనిచేసే మహిళలకు స్త్రీశక్తి ఎంతో ఉపయోగపడుతోంది. ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్ బుధవారం పుట్టపర్తిలో ఉచిత బస్సులో ప్రయాణిస్తున్న మహిళలతో మాట్లాడారు. సౌకర్యాలు ఎలా ఉన్నాయి, సిబ్బంది ఏమైనా ఇబ్బంది పెడుతున్నారా? ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయాణిస్తున్నారు? అని అడిగి తెలుసుకున్నారు.

చెరువులకు మహర్దశ

- కంపచెట్ల తొలగింపు.. కాలువలకు మరమ్మతులు
- నిధుల మంజూరు చేసిన ప్రభుత్వం

చెరువులు	మంజూరైన నిధులు
1. కాటిగానిచెరువు	రూ.2.50లక్షలు
2. గొట్లూరు చెరువు	రూ.3.00లక్షలు
3. చింతలపల్లి చెరువు	రూ.2.50లక్షలు
4. పోతుకుంట చెరువు	రూ.3.00లక్షలు
5. ధర్మవరం చెరువు	రూ.5.00లక్షలు
6. రావులచెరువు చెరువు	రూ.2.50లక్షలు
7. సీసీకొత్తకోట చెరువు	రూ.2.50లక్షలు
8. కట్టకిందపల్లిచెరువు	రూ.2.50లక్షలు
మొత్తం	రూ.23.50లక్షలు



కంపచెట్లు తొలగించిన తర్వాత గొట్లూరు చెరువు కట్ట

ధర్మవరంరూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కంపచెట్లతో నిండిపోయిన చెరువుల మరమ్మతులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో చెరువులకు మహర్దశ వస్తోందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో చెరువుల మరమ్మతులపై దృష్టి సారించకపోవడంతో కట్టలమీద విపరీతంగా కంపచెట్లు పెరిగిపోయాయి. ఆయకట్టు కాలువల్లో నీరు సజావుగా పారక రైతులు ఇబ్బందులు పడుతుండేవారు. చెరువుల వద్దకు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెరువుల కట్టలు, ఆయకట్టు కాలువల మరమ్మతులు, కంపచెట్ల తొలగింపునకు చర్యలు చేపట్టింది. మండలంలోని 8 చెరువులకు రూ.23.50 లక్షలు నిధులు మంజూరు చేయడంతో పనులు పూర్తిచేశారు. దీంతో చెరువులకు మహర్దశ (మిగతా 6లో...)



బోరుబావి నుంచి ఉబికివస్తున్న నీరు

పాతాళం నుంచి భూతలంపైకి..

బుడ్డారెడ్డిపల్లిలో బోరుబావి నుంచి ఉబికి వస్తున్న నీరు

ధర్మవరం రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గత వారం పది రోజుల నుంచి కురిసిన వర్షాలకు వంకలు, వాగులు, చెక్‌డ్యాంలు, చెరువులు నిండిపోయాయి. దీంతో భూగర్భ జలాలు పెరిగాయి. అరకొరగా వస్తున్న బోరుబావులు పూర్తిస్థాయిలో రీచార్జ్ అయ్యాయి. కొన్నిచోట్ల మోటారు లేకుండానే కేసింగ్ పైపుల ద్వారా నీరు ఉబికి వస్తోంది. మండలంలోని బుడ్డారెడ్డిపల్లి గ్రామంలో రైతు దేవరపల్లి శ్రీనివాసరెడ్డి పొలంలో బోరుబావి నుంచి రెండు రోజుల నుంచి పాతాళగంగ ఉబికి వస్తోంది. ఇటీవలే ఆ రైతు బోరుబావిని తవ్వించారు. ఇంకా మోటారు కూడా బిగించలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు అతడి పొలం చుట్టూ ఉన్న చెక్‌డ్యాంలు, వంకలు పొంగిపొర్లాయి. దీంతో బోరుబావి నుంచి ఆమాంతంగా నీరు వస్తున్నట్లు ఆ రైతు ఆనందంగా తెలిపాడు.

రాబంధువు..!

- ప్రజాధనం కొల్లగొడుతున్న ప్రజాప్రతినిధి బంధువు
- వాణిజ్య కాంప్లెక్స్ అద్దెల్లో గోల్‌మాల్
- ఇతరులకు అద్దెకు ఇచ్చి అధికంగా వసూళ్లు
- చోద్యం చూస్తున్న అధికారులు



గోల్‌మాల్ జరిగిన వాణిజ్య కాంప్లెక్స్ ఇదే

పెనుకొండ టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్తులకు ధర్మకర్తలుగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులే స్వార్థంతో వాటిని 'వివిధ రకాలుగా' కొల్లగొడుతున్నారు. స్వామి భక్తితో అధికారులు వారికి సహకరిస్తున్నారు. ఇందుకు పెనుకొండలో ప్రభుత్వ షాపింగ్ కాంప్లెక్సే చక్కటి నిదర్శనం. పట్టణంలో మూడేళ్ల కిందట మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో రూ.54లక్షలతో ఓ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ఇందులో పది గదులు ఉన్నాయి. మరో ఐదు నెలల తర్వాత రూ.30 లక్షలతో మరో నాలుగు గదులు నిర్మించారు. ఒక్కో గదిని రూ.ఆరువేలకు అద్దెకు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. అలాగే రెండు నెలల అడ్వాన్స్ చెల్లించాలని వ్యాపారులకు నిబంధన పెట్టారు. ఇదే అదనుగా భావించిన వైసీపీ మండల ప్రజాప్రతినిధి ఒకరు తన బంధువు పేరుతో నాలుగు గదులు అద్దెకు తీసుకున్నాడు. వాటిని రెండింతల ధరకు అద్దెకు ఇచ్చాడు.

అద్దె స్వాహా

ఒక్కో గదికి రూ.ఆరువేలు అద్దె చెల్లించేలా ఆ మండల ప్రజాప్రతినిధి 2023 డిసెంబరులో తన బంధువు పేరుతో అగ్రిమెంట్ చేసుకున్నాడు. అందులో మూడు గదులు ట్రాక్టర్ షోరూమ్‌కు, మరోదాన్ని సువిధ సర్వీస్ కేంద్రానికి అద్దెకు ఇచ్చారు. ఇందుకుగాను ప్రతినెలా ట్రాక్టర్ షోరూమ్‌తో రూ.33వేలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. మరోషాపు రూ.10వేలుకు ఇచ్చినట్లు తెలిసింది. వారితో ప్రతినెలా క్రమం తప్పకుండా అద్దె వసూలు చేసే ఆ ప్రజాప్రతినిధి బంధువు ప్రభుత్వానికి మాత్రం గత ఎనిమిది నెలలుగా అద్దె చెల్లించడం లేదు. అడిగేవారు లేకపోవడంతో హాయిగా కాలం వెళ్లదీస్తున్నాడు. అగ్రిమెంట్ చేసుకున్నది ఒకరైతే అద్దెకున్నది మరొకరు. వీటిని తనిఖీ చేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇలా ఓ వైపు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ మరో వైపు వ్యాపారులతో అక్రమంగా ఆ ప్రజాప్రతినిధి బంధువు అద్దె వసూలు చేస్తున్నా ప్రశ్నించేవారే కరువయ్యారని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాది దాటినా ఇంకా వైసీపీ నాయకుల పెత్తనమే సాగుతుండటంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

వసూలు చేస్తాం : ఎంపీడీఓ, సురేష్ కృష్ణ



మా కార్యాలయానికి సంబంధించి ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌కు నాలుగు నెలల అద్దె రావాలి. ఇప్పటికే పలుమార్లు అడిగాము. త్వరలో ఇస్తామని మొండికేస్తున్నారు. అకౌంట్‌లో జమచేయకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు చేపడతాం.

తవ్వకాల్లో

చరిత్ర

- మట్టిలో కలిసిపోతున్న పురాతన శిల్పసంపద
- గుప్తనిధుల కోసం ఆలయం అంతా పెకలింపు
- అధ్వానస్థితిలో పంచలింగాల ఆలయం

6

ఖతర్ నుంచి

సొంతూరుకు..!

- నూరుల్లా మృతదేహాన్ని తెప్పించిన టీడీపీ ఎన్ఆర్ఐ వింగ్
- కన్నీటి వీడ్కోలు పలికిన కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు



ఆదర్శంగా ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్

● ఎమ్మెల్యే పరిటాల సునీత ● కందుకూరు ఎంజీ లేఅవుట్‌లో మౌలిక వసతుల పనులకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, అహుడా చైర్మన్ టీసీ వరుణ్

అనంతపురం రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌ను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుతామని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని కందుకూరు గ్రామ సమీపంలోని ఎంజీ లేఔట్‌లో మౌలిక వసతుల పనులకు అహుడా చైర్మన్ టీసీ వరుణ్‌తో కలిసి ఆమె బుధవారం శంకుస్థాపన చేశారు. అహుడా, పబ్లిక్ హెల్త్ శాఖ ఆధ్వర్యంలో రూ.40కోట్ల అంచనాతో పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లో ప్లాట్లు కొన్న వారికి అద్భుత సౌకర్యాలు ఉంటాయన్నారు. మధ్యతరగతి వర్గాలకు అధునాతన సౌకర్యాలతో కూడిన ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అహుడా ఆధ్వర్యంలో నిర్మాణాలు వేగంగా సాగుతాయన్నారు. ప్రతి ప్లాట్‌కు విద్యుత్ సౌకర్యం, తాగునీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

తవ్వకాల్లో చరిత్ర

● మట్టిలో కలిసిపోతున్న పురాతన శిల్పసంపద
● గుప్తనిధుల కోసం ఆలయం అంతా పెకలింపు
● అధ్వానస్థితిలో పంచలింగాల ఆలయం

కళ్యాణదుర్గం/కుందుర్పి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కొందరు స్వార్థపరులు చరిత్రను మట్టిలో కలిపేస్తున్నారు. దురాశతో పురాతన సంపద కోసం ఆలయాలను తవ్వేస్తున్నారు. దీంతో శతాబ్దాల చరిత్ర కలిగిన శిల్పాలు, ఘన చరిత్రకు ఆనవాలుగా మిగిలిన ఆలయాలు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ఇందుకు కుందుర్పి మండలం మలయనూరు గ్రామంలోని పంచలింగాల ఆలయమే ఉదాహరణ. ఈ ఆలయాన్ని క్రీ.శ.1179వ సంవత్సరంలో పశ్చిమ చాళుక్యులు నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ఇక్కడ ఒకే ప్రాంగణంలో మల్లికార్జున దేవాలయం, లక్ష్మణేశ్వర దేవాలయం, చిరుగోళ్లేశ్వర దేవాలయం, మహేశ్వర దేవాలయం, సూర్య దేవర ఆలయం ఉన్నాయి. వీటిని ఒక్కరోజులోనే నిర్మించి, అందులో దేవతా మూర్తులను ప్రతిష్ఠించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఈ దేవాలయాలు పూర్తిగా పాడుబడిపోయాయి. కొందరు దుండగులు గుప్త నిధుల కోసం ఆలయాలను తవ్వేశారు. ఈ క్రమంలో స్థానికుల ఫిర్యాదుపై 2024, 2025లో రెండు కేసులు నమోదయ్యాయి. గుప్తనిధుల తవ్వకాలపై 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు.



శిథిలావస్థకు చేరిన పంచలింగాల దేవాలయం



ఆలయ వైభవాన్ని తెలుపుతున్న శిలాశాసనం



ఆలయం లోపల పెకలించిన దృశ్యం

గుప్తనిధుల ఆశతో ఆలయం ధ్వంసం

ఈ పంచలింగాల ఆలయంలో భారీగా గుప్తనిధుల ఉన్నాయన్న ఆశతో కొందరు దుండగులు రహస్యంగా ఆలయాన్ని అంతా ధ్వంసం చేశారు. లోపల ఉన్న నంది విగ్రహం, శివలింగాన్ని పూర్తిగా పగలకొట్టేశారు. ఆలయంలో ఎంతో ఘనత కలిగిన శిల్ప సంపద ఉన్నప్పటికీ గుప్తనిధుల తవ్వకాలతో ఆలయ వైభవం మరుగున పడిపోయింది. ఆలయంలో కంపచెట్లు పెరిగిపోయాయి. ఈ ఆలయ విషయాన్ని పలుమార్లు పురావస్తుశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అనంతపురం, కర్నూలు పురావస్తుశాఖ సహాయ సంచాలకురాలు డాక్టర్ రజిత ఈ ఆలయాన్ని పలుమార్లు సందర్శించినప్పటికీ అభివృద్ధిపై ఏ మాత్రం చర్యలు తీసుకోలేదు. దీంతో ఆలయం అంతా అధ్వానస్థితికి చేరుకుంది. దీంతో ఇది పేకాట, మందు బాబులకు నిలయంగా మారింది.

కాపాడుకుందాం



కుందుర్పి మండలంలోని మలయనూరులో ఐదు లింగాల దేవాలయంలో ఉన్న శిల్ప సంపద పూర్తిగా అంతరించిపోయింది. ఎంతో చరిత్ర కలిగిన ఈ దేవాలయం నేడు పూర్తిగా కనుమరుగయ్యే దుస్థితిలో ఉంది. పురావస్తు శాఖ అధికారులు ఈ ఆలయం బాగోగులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. మాన దేశ ఘనతను చాటే ఇలాంటి వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

-నరసింహులు, గురివేపల్లి, కుందుర్పి మండలం

శిల్ప కళా సంపదకు మారుపేరు



మా గ్రామంలో ఉన్న ఐదు లింగాల దేవాలయం శిల్ప కళా సంపదకు మారుపేరు. అయితే ఈ సంపదను కాపాడటంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. ఎంతో వైభవం కలిగిన ఆలయం మా గ్రామంలో ఉండటం మాకు గర్వకారణం.

-సంజీవ, మలయనూరు, కుందుర్పి మండలం

వెలలేని ఆస్తి..!

ఓ రైతు వద్ద 1818 నాటి నాణెం

నాణేనికి తొలిపూజతో పంట సాగుచేస్తున్న రైతు నల్లప్ప



1818 కాలం నాటి అర్ధ అణా

1818 కాలం నాటి అర్ధ అణాపై ఒకవైపు సీతారామ లక్ష్మణ ప్రతిబింబం

శింగనమల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అపురూపమైన ఆ నాణ్యం రెండు శతాబ్దాల నుంచి వంశపారంపర్యంగా పెద్ద మట్లగొంది గ్రామా నికి చెందిన రైతు నల్లప్ప కుటుంబం వద్ద ఉంటోంది. ప్రస్తుతం చెలామణీలో లేని ఆ నాణ్యంను ఆ కుటుంబం భద్రంగా కాపాడుకుంటోంది. 1818లో బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆ అర్ధ అణా నాణ్యాన్ని ముద్రించినట్లు దానిపై ఉంది. ఓ వైపున ధాన్యపు కంకులు, ముద్రించిన సంవత్సరం, ఈస్ట్ ఇడియా కంపెనీ పేరు ఉండగా మరో వైపు సీతారామలక్షణ ఆంజనేయుడి బొమ్మలు ముద్రితమయ్యాయి. తాత, ముత్తాతల నుంచి వచ్చిన ఈ నాణెంను ఆ కుటుంబ సభ్యులు తమ ఇంటిలో దేవుడి మూలన ఉంచి పూజలు చేస్తున్నారు. పంటలు సాగు చేసే సమయం, నూర్పిడి సమయాల్లో దేవుడి కంటే కూడా ముందుగా ఆ నాణేన్ని పూజిస్తున్నట్లు రైతు నల్లప్ప తెలిపాడు. ఇలా చేస్తే పంట బాగా పండి ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆయన పేర్కొన్నారు.

ఇంటిగ్రేటెడ్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ, బ్లెకింగ్ వర్సిటీ (స్వీడన్)సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నట్లు వర్సిటీ ఫారిన్ అఫైర్స్ డైరెక్టర్ ఆచార్య సుజాత తెలిపారు. ఆమేరకు బుధవారం సీఎస్ఈ విభాగానికి ఒక అడ్మిషన్ జరిగినట్లు తెలిపారు. ఇంకా సీఎస్ఈ -02, ఈసీఈ-7 సీట్లు ఉన్నాయన్నారు. మిగిలిన సీట్లకు వీసీ సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య స్పాట్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సు అభ్యసించడం ద్వారా విదేశాల్లో ఉద్యోగం సంపాదించడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయన్నారు. కోర్సు ఫీజు ఏడాదికి రూ.1.5లక్షలు అని తెలిపారు.

రైల్వే ట్రాక్‌తో నష్టం లేకుండా చూడండి

● కేంద్ర మంత్రికి ఎంపీ అంబికా వినతి



కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ అంబికా

అనంతపురం క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గుంతకల్లు మండలంలోని దోనిముక్కల, తిమ్మాపురం, కొనకొండ్ల, జి. కొట్టాల గ్రామాల్లో ప్రతిపాదిత రైల్వే ట్రాక్ వల్ల రైతులకు నష్టం లేకుండా చూడాలని రైల్వే, జలశక్తి శాఖ సహాయమంత్రి వీరన్న సోమణ్ణను అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. దేశరాజధానిలో బుధవారం ఆయన కేంద్ర మంత్రిని కలిసి, వివిధ అంశాలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గుంతకల్లు ప్రాంతంలో ఆయా గ్రామాల ప్రజలు ఇప్పటికే జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయారని, ఇప్పుడు రైల్వేట్రాక్ వెళితే మరింత నష్టం జరుగుతుందన్నారు. రైల్వేట్రాక్ మార్పుపై పునరాలోచించి ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని కోరారు. నర్సాపురం-ధర్మవరం (17247/17248) ఎక్స్‌ప్రెస్ ట్రైన్ ప్రస్తుతం ధర్మవరం వరకూ మాత్రమే నడుస్తోందని, గుంతకల్లు వరకూ పొడిగిస్తే...అనంతపురం, గుంతకల్లు ప్రజలకు సులభ రవాణా సదుపాయం కలుగుతుందన్నారు. హైదరాబాద్(కాచిగూడ) నుంచి బెంగళూరు(యశ్వంత్‌పూర్)వెళ్లే వందేభారత్ ట్రైన్ హిందూపురంలో హాల్ట్ ఉండేలా చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ వెంట టీడీపీ సీనియర్ నేత కేసీ హరి, సర్పంచ్ శ్రీరాములు, ఓబులేసు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా పర్యాటక శాఖాధికారి శివరామకృష్ణ

అనంతపురం టౌన్, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల కోసం 2025-26 సంవత్సరానికిగాను అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటకశాఖ అధికారి శివరామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. అభ్యర్థులు కేంద్ర, రాష్ట్ర పర్యాటకశాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కేటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రిషియన్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీఎస్సీ(హెచ్- హెచ్‌ఏ) 3 సంవత్సరాల డిగ్రీ కోర్సుకు ఇంటర్‌లో 40శాతం పైగా మార్కులు వచ్చిన వారు అర్హులన్నారు. ఈ కోర్సులో ఫుడ్ ప్రొడక్షన్, ఫ్రంట్ ఆఫీస్, హౌస్‌కీపింగ్ నేర్పించి, ప్రముఖ ఫైవ్‌స్టార్ హోటళ్లలో ప్రాక్టికల్ ట్రైనింగ్ నాలుగు నెలలు ఇప్పిస్తామన్నారు. ఫుడ్ ప్రొడక్షన్‌లో క్రాఫ్ట్ కోర్స్, పెటిసరీ కోర్సుకు పదో తరగతి పాసైనవారు అర్హులన్నారు. ఈ కోర్సుకు ఏడాదిపాటు దేశ విదేశాల వంటకాలు నేర్పించి, ఆరు నెలలపాటు ఫైవ్‌స్టార్ హోటళ్లలో ప్రాక్టికల్ శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఫుడ్ సర్టిఫికెట్, బేవరేజ్ సర్వీస్ కోర్సుకు కూడా పదోతరగతి పాసైనవారు అర్హులన్నారు. ఈ కోర్సులో ఐదు నెలలపాటు రెస్టారెంట్, బార్ సర్వీస్ నేర్పించి నెలపాటు ప్రముఖ ఫైవ్‌స్టార్ హోటళ్లలో శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఈ కోర్సులకు వయోపరిమితి లేదని తెలిపారు. కోర్సులు పూర్తయిన తర్వాత రాష్ట్ర పర్యాటకశాఖలోని హోటళ్లు, ఫైవ్‌స్టార్ హోటళ్లలో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి గలవారు ఈనెల 25లోపు టీటీ టీ.ఁజీజిరుఙ్జఞ౯ాటజ వెబ్‌సైట్ లేదా 9701343846, 9100558006 నెంబర్లను సంప్రదించవచ్చునన్నారు.

దీర్ఘకవితల పోటీలకు ఆహ్వానం

అనంతపురం టౌన్(ఆంధ్రజ్యోతి): దీర్ఘ కవితల పోటీలకు సాహితీవేత్తల నుంచి కవితలను ఆహ్వానిస్తున్నట్లు రాయలసీమ సాంస్కృతిక వేదిక సమన్వయకర్త డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. రాయలసీమ సాంస్కృతికోద్యమంలో భాగంగా ప్రతి ఏడాది సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సాహితీవేత్తలు రాయలసీమ నేపథ్యంపై రాసిన దీర్ఘ కవితలను నవంబరు 1లోపు 'డా. అప్పిరెడ్డి హరినాథరెడ్డి, డో.నెం.1-1349, ఫ్లాట్ నెం.24, షైన్ విలాస్, టాటా షోరూమ్ వద్ద, నేషనల్ హైవే, రుద్రంపేట, అనంతపురం-515002 చిరునామాకు పంపాలన్నారు. వివరాలకు 99639 17187 నెంబర్‌ను సంప్రదించవచ్చునన్నారు.

తిరుపతిలో 'అమరావతి చాంపియన్ షిప్'

● శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు

అమరావతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో 'అమరావతి చాంపియన్ షిప్-2025' పేరుతో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. ఈ నెల 29న జరగనున్న నేషనల్ స్పోర్ట్స్ డేలో భాగంగా రాష్ట్రస్థాయి పోటీలకు తిరుపతి ఆతిథ్యమిస్తోందని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 24, 25, 26వ తేదీల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రస్థాయిలో హాకీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్ బాల్, ఖోఖో, కబడ్డీ, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో రెండు వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 29న విశాఖపట్నంలో జరిగే నేషనల్ స్పోర్ట్స్ డేకు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేస్తామని రవినాయుడు స్పష్టం చేశారు.

చెరువులకు మహర్దశ



గొట్లూరు చెరువుకట్టపై ఉన్న కంపచెట్లు (ఫైల్)

(5వ పేజీ తరువాయి)

వచ్చినట్లయింది. వర్షాలు కురిసి నీరు చేరితే చెరువుల వద్దకు వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని రైతులు పేర్కొంటున్నారు.

చెరువుకట్టను చూస్తే ఆనందంగా ఉంది



మా గ్రామంలో చెరువుకట్టపై విపరీతంగా కంపచెట్లు పెరిగి చెరువులోకి కూడా వెళ్లలేకపోయేవాళ్లం. ప్రస్తుతం చెరువుకట్టపై కంపచెట్లు, ఇతర ముళ్ల కంపలు తొలగించడంతో కట్టకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారు. దీంతో చెరువుకట్టను చూస్తే ఆనందంగా ఉంది.

-వెంకటేష్ చౌదరి, చింతలపల్లి

ఏళ్లనాటి కంపచెట్లు తొలగించారు



మా చెరువుకట్టపై ఎన్నోఏళ్ల నుంచి కంపచెట్లు పెరిగిపోయి ఉండేవి. దీంతో చెరువుకట్ట వద్దకు వెళ్లాలంటేనే భయంగా ఉండేది. చెరువు నిండినప్పుడు చూడటానికి కట్ట మీదకు వెళ్లాలంటే ఇబ్బంది పడేవాళ్లం. కూటమి ప్రభుత్వం రాగానే చెరువుకట్టపై ఉన్న కంపచెట్లు తొలగించి, కట్టకింద ఉన్న మట్టిజారిపోకుండా చర్యలు తీసుకున్నారు. -బండ్ల రామకేశవులు, గొట్లూరు

చెరువు కట్టలు, కాలువలకు మరమ్మతులు

చెరువు కట్టలు, కాలువల మరమ్మతుల కోసం ప్రభుత్వం మైనర్ ఇరిగేషన్ అపరేషన్ మెయింటెనెన్స్ కింద 8 చెరువులకు రూ23.50 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఇప్పటి వరకు చింతలపల్లి, గొట్లూరు, పోతుకుంట, కట్టకిందపల్లి, సీసీకొత్తకోట చెరువు కట్టలు మీద ఉన్న కంపచెట్లు, ఆయకట్టు కాలువల్లో నీరు వెళ్లేందుకు ముళ్లకంపలు, మట్టి అడ్డులేకుండా చర్యలు చేపట్టాం. మిగిలిన చెరువుల కట్టలు, ఆయకట్టు కాలువలపై పనులు పూర్తి చేయిస్తాం. -గురుప్రసాద్, ఏఈ, జలవనరుల శాఖ

అయోమయ పరీక్షలు..!

(5వ పేజీ తరువాయి)

జవాబులు రాయడానికి ఇబ్బంది పడ్డారు.



విద్యాశాఖ రూపొందించిన ఎఫ్ఏ-1 బుక్‌లెట్

సిలబస్‌ను కాదని..

ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లంతా సిలబస్ మేరకు పాఠాలు బోధించి అందులో నుంచే ప్రశ్నపత్రం రూపొందించేవారు. ఈనెల 11 నుంచి 14వరకు జరిగిన ఎఫ్ఏ-1 పరీక్షల్లో బోధనకు అనుగుణంగా కాకుండా.. తార్కిక, అనువర్తిత (అప్లికేషన్ మెథడ్) విధానంలో ప్రశ్నపత్రాలు రూపొందించారు. దీంతో విద్యార్థులు జవాబులు రాయలేక పోయారని టీచర్లు వ్యాఖ్యానిస్తున్నారు. జవాబు పత్రాలు మూల్యాంకనం చేసే వారికి సైతం కొన్ని ప్రశ్నలు అర్థంకాలేదు. 9,10వ తరగతి విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రాలు యథావిధిగా ఉన్నాయని, ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రాలతోనే తంటా వచ్చిందని మరో ఉపాధ్యాయుడు అభిప్రాయ పడ్డారు. ఒకటి, మూడు తరగతుల పిల్లలకు పెట్టిన నిబంధనలతో గందరగోళం నెలకొంది. మూల్యాంకనం చేసేందుకు టీచర్లు నానా తిప్పలు పడుతున్నారు. ఎస్‌సీఈఆర్టీ విభాగం నిర్వాకంతోనే ఎఫ్ఏ పరీక్షలు విమర్శలకు తావిచ్చిందని టీచర్లు వ్యాఖ్యానిస్తున్నారు.

బబ్లింగ్ విధానం తొలగించాలి



ప్రభుత్వం ఒకటి నుంచి పదో తరగతి వరకు నిర్వహించే ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2, ఎఫ్ఏ-3 పరీక్షలకు సబ్జెక్టుకు ఒక బుక్‌లెట్ విధానం తీసుకువచ్చింది. ఈ పద్ధతి బాగుంది. 1 నుంచి 8వ తరగతి వరకు బబ్లింగ్ విధానం పెట్టడం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు ఈ విధానం తెలియకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు. ఈ విధానాన్ని తొలగించి పాతపద్ధతిలోనే పరీక్షలు నిర్వహించాలి.

-ఆర్.చంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీటీఎఫ్

పోటీ పరీక్షలకు ఉపయోగం



ప్రభుత్వం రాబోవు కాలంలో పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకే ఈ విధానాన్ని తీసుకువచ్చింది. అందులో భాగంగా ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠశాలలో నిర్వహించే పరీక్షలకు ఈ విధానాన్ని అమలు చేస్తోంది. ఈ విధానానికి విద్యార్థులు అలవాటు పడటానికి సమయం పడుతుంది. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

-కిష్టప్ప, డీఈఓ

ఖతర్ నుంచి తనకల్లుకు నూరుల్లా మృతదేహం

● టీడీపీ ఎన్ఆర్ఐ వింగ్ ఖర్చులతో స్వస్థలానికి..
● బతుకుదెరువుకు వెళ్లి 20 రోజుల క్రితం మృతి

తనకల్లు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండల కేంద్రానికి చెందిన నూరుల్లా(36) మృతదేహం ఖతర్ నుంచి స్వస్థలానికి బుధవారం చేరింది. బతుకుదెరువు కోసం నూరుల్లా నాలుగేళ్ల క్రితం ఖతర్ వెళ్లారు. వెళ్లింది మొదలు ఒక్కసారి కూడా స్వదేశానికి తిరిగిరాలేదు. ఖతర్‌లో డ్రైవర్‌గా పనిచేస్తూ ఇక్కడ చేసిన అప్పులను వడ్డీ సహా చెల్లించేశారు. మరో నెల రోజులు పనిచేసి, ఇంటికి కొంత డబ్బుతో వస్తానని కుటుంబ సభ్యులకు గత నెల 30న ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. కానీ ఆ మరుసటి రోజే మృతిచెందినట్లు అక్కడి నుంచి సమాచారం వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని పంపేందుకు అక్కడి యజమాని డబ్బులు ఇవ్వాలని కోరడంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొన్నారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సాయం కోరారు. దీంతో ఆయన విషయాన్ని ఆయన ముఖ్యమంత్రి కార్యాలయం, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఖతర్‌లో ఉన్న భారతీయుల సాయం కోరారు. అలా సమస్య ఇండియన్ ఎంబసీ వరకూ వెళ్లింది. మంత్రి నారా లోకేశ్ సూచనలతో టీడీపీ ఎన్ఆర్ఐ వింగ్ నాయకులు వేమూరి రవికుమార్ స్పందించారు. నూరుల్లా మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు అయ్యే ఖర్చులను ఎన్ఆర్ఐ వింగ్ సమకూర్చింది. అలా ఖతర్ నుంచి బెంగళూరు ఎయిర్‌పోర్టుకు, అక్కడి నుంచి అంబులెన్సులో తనకల్లుకు చేర్చారు. నూరుల్లా మృతదేహాన్ని చూడగానే భార్య తల్లి ఫరియానా, సాబాజ్, కూతుళ్లు ఆయేషా, సన్నా కౌసర్, ఇతర కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు. కుటుంబ సభ్యులు అంత్యక్రియలను పూర్తి చేశారు. సహకరించిన కదిరి ఎమ్మెల్యే కందికుంటకు కృతజ్ఞతలు తెలిపారు. సెంటు భూమి లేని ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బంధుమిత్రులు విన్నవించారు.



నూరుల్లా (ఫైల్)

రుణం తీరిపోయింది..

కొవిడ్‌కు కొంతకాలం ముందు జీవనోపాధి కోసం నూరుల్లా అప్పు చేసి ఐచర్ వాహనం కొనుగోలు చేశారు. ప్రభుత్వం లాక్‌డౌన్ విధించడంతో రెండేళ్లు ఎలాంటి బాడుగలు రాలేదు. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. అప్పులవారి ఒత్తిళ్లు పెరిగాయి. వాటిని తీర్చడం ఇక్కడ సాధ్యం కాదని, ఖతర్ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అక్కడికి వెళ్లాక నూరుల్లా ప్రతి నెలా డబ్బులు పంపించారు. అప్పులను వడ్డీ సహా చెల్లించమన్నాడు. ఆయన మాటను భార్య, తల్లి పాటించారు. నాలుగేళ్ల కష్టపడి అప్పులు తీర్చేశారు. ఇంకొక్క నెల పనిచేసి, చేతిలో కొంత డబ్బు తీసుకుని వస్తాను అని నూరుల్లా తన భార్యకు ఫోన్ చేసి చెప్పారు. అంతలోనే రుణం తీరిపోయింది అన్నట్లు ప్రాణాలు విడిచారు. గత నెల 31న తన యజమానిని దించేసి, తిరిగి వచ్చే దారిలో బ్రిడ్జిపై వాహనాన్ని ఆపారు. అక్కడి నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారా, ప్రమాదవశాత్తూ పడ్డారా అన్న స్పష్టత లేదు.



మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు

విద్యాలయం కోసం..!

భూములు పరిశీలించిన కలెక్టర్



చెన్నంపల్లిలో గొడుగు పట్టుకుని భూమిని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కళ్యాణదుర్గం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ నవోదయ విద్యాలయం నిర్మాణం కోసం భూమిని గుర్తించేందుకు కంబదూరు మండలం పాళ్లూరు చెన్నంపల్లిలో కలెక్టర్ వినోద్ కుమార్ పర్యటించారు. గొల్లపల్లి, చెన్నంపల్లి గ్రామాల పరిధిలో ఉన్న భూములను బుధవారం ఆయన పరిశీలించారు. వర్షం వస్తుండటంతో గొడుగు పట్టుకుని, రాత్రి పొద్దుపోయాక టార్చ్‌లైట్లు వేసుకుని భూములకు సంబంధించిన స్కెచ్‌లను పరిశీలించారు. ఈ రెండు గ్రామాల పరిధిలో ప్రభుత్వ భూమిని గుర్తించాలని అధికారులకు ఆదేశించారు. చెన్నంపల్లి పరిధిలో సర్వే నెంబర్ 169, 170లో ఉన్న 30.75 ఎకరాల భూమిని పరిశీలించారు. అనంతరం పాళ్లూరు రెవెన్యూ గ్రామ పరిధిలోని గొల్లపల్లి, చెర్లోపల్లి గ్రామాల మధ్యలో వున్న సర్వే నెంబర్ 242లో 158 ఎకరాల భూమిని కలెక్టర్ పరిశీలించారు. అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, ఆర్డీవో వసంత బాబు, డీఏ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.19వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.9వేలు, సరాసరి ధర రూ.14వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 745 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.



క్రైం కార్నర్

తల్లి మందలించిందని కుమారుడి ఆత్మహత్య

లేపాక్షి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తల్లి మందలించిందన్న మనస్తాపంతో మండలంలోని తిలక్‌నగర్‌కు చెందిన ఆకాష్(27) మంగళవారం ఇంట్లో చీరతో పైకప్పునకు ఉరేసుకుని, మృతిచెందాడు. తల్లి భూదేవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కళ్యాణదుర్గానికి చెందిన భూదేవికి గౌరీబిదనూరులో నివాసముండే రవిచంద్రకుమార్‌తో వివాహమైంది. దంపతులు 16ఏళ్ల క్రితం విడిపోయారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు ఆకాష్, తల్లి వద్దే ఉండేవాడు. వీరు జీవనోపాధి కోసం తిలక్‌నగర్‌కు వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. ఆకాష్ కియ పరిశ్రమలో ఉద్యోగం చేస్తుండేవాడు. ఇటీవల ఉద్యోగం మానేసి జులాయిగా తిరుగుతుండేవాడు. మంగళవారం తల్లి ఏదైనా పనిచేసుకోవాలని చెప్పింది. తర్వాత గౌరీబిదనూరుకు బయల్దేరింది. రైల్వేస్టేషన్ వరకు తల్లికి తోడుగా వెళ్లాడు కూడా. అనంతరం ఆకాష్ ఇంటికెళ్లి పైకప్పునకు ఉరేసుకున్నాడు. చుట్టుపక్కలవారు గమనించి తల్లికి ఫోన్ చేయగా మంగళవారం రాత్రికి ఇంటికి చేరుకుంది. తలుపులు బద్దలుకొట్టి చూడగా అప్పటికే మృతిచెందాడు. భూదేవి ఫిర్యాదు మేరకు లేపాక్షి ఏఎస్ఐ షర్ఫుద్దీన్ కేసు నమోదు చేసుకున్నారు.

యువకుడి అదృశ్యం

అనంతపురం క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచానపల్లికి చెందిన ఓ యువకుడు హెయిర్ కటింగ్ కోసం వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లి కనిపించకుండా పోయినట్టు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతపురం రూరల్ పోలీసులు బుధవారం తెలిపిన వివరాల మేర కు.. సత్యనారాయణ(32) రెండు రోజుల కిందట కటింగ్ తీయించుకుంటానని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తర్వాత ఇంటికి తిరిగి రాలేదు. కు టుంబీకులు పలు చోట్ల వెతికినా కనిపించకపోవడంతో అతడి తండ్రి ఈశ్వర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పట్నం పూర్వపు ఎస్ఐపై కేసు నమోదు



రాజశేఖర్

అనంతపురం క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బ సర్కిల్ పరిధిలోని పట్నం పోలీస్ స్టేషన్ పూర్వపు ఎస్ఐ రాజశేఖర్‌పై కేసు నమోదైంది. లైంగిక వేధింపులకు సంబంధించి బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుత్తి పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 189/2025 కింద కేసు నమోదు చేశారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం, బీఎన్ఎస్, ఐటీ చట్టాలలోని పలు సెక్షన్ల కింద కేసు కట్టారు. సమస్య పరిష్కారం కోసం పట్నం స్టేషన్‌కు వచ్చిన ఓ మహిళను ఎస్ఐ హోదాలో రాజశేఖర్ వేధించారనే ఆరోపణలు వచ్చాయి. బాధితురాలని వేధించిన అసభ్యకర వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో ఎస్పీ రత్న ఎస్ఐని తొలుత వీఆర్‌కు పంపారు. శాఖపరమైన విచారణలో వేధింపులు నిజమేనని తేలడంతో కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఆయనను సర్వీస్ నుంచి తొలగించారు. తాజాగా బాధితురాలి నుంచి ఫిర్యాదు స్వీకరించి, కేసు నమోదు చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మొదటే మడకశిర చెరువులకు నీరివ్వాలి

- ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అనంతపురం క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా కాలువ ద్వారా మడకశిర నియోజకవర్గంలోని చెరువులకు మొదట నీళ్లు ఇవ్వాలని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ఎంపీ పార్థసారథి హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులను ఆదేశించారు. అనంతపురంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఎమ్మెల్యే రాజు హంద్రీనీవా అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు ఎంపీ పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరయ్యారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ ప్రతి ఏటా కృష్ణా జలాలు మడకశిర నియోజకవర్గంలోని చెరువులకు సరిగా చేరకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకే ఈ ఏడాది మొదటే మడకశిర చెరువులను నీటితో నింపాలన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి త్వరలో ఐఏబీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, హంద్రీనీవా జలాలు చెరువులకు అందించే అంశాలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకునేలా చూడాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎస్ఈ స్వరూప్, డీఈఈలు, ఏఈఈలు, వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి, సింగిల్ విండో అధ్యక్షుడు, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

అనంత అమ్మాయిలు అదుర్స్

ఆంధ్రా సీనియర్ మహిళా క్రికెట్ జట్టు ప్రాబబుల్స్‌కు ఆరుగురి ఎంపిక



చక్రిక దండు | హర్షిత | తేజశ్విని | నేహా | హన్సిరెడ్డి | అర్షియా

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-23 సీనియర్ మహిళా క్రికెట్ జట్టు ప్రాబబుల్స్‌కి ఉమ్మడి జిల్లా నుంచి ఆరుగురు ఎంపికయ్యారు. నేహా (అనంతపురం), చక్రిక దండు (అనంతపురం), అర్షియా (కదిరి), హన్సిరెడ్డి (అనంతపురం), తేజశ్విని (కదిరి), హర్షిత (గుంతకల్లు) చోటు దక్కించుకున్నారు. గురువారం నుంచి విజయవాడ మూలపాడులో జరిగే టీ20 మ్యాచ్‌లకు ప్రాతినిధ్యం వహించనున్నారు. క్రికెటర్లను పలువురు అభినందించారు.

అంతర్జాతీయ శిక్షణకు శాప్ కోచ్ జబీవుల్లా



అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వాలీబాల్ శిక్షణకు శాప్ కోచ్ జబీవుల్లా ఎంపికయ్యారు. అనంతపురం నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియంలో వాలీబాల్ శాప్ కోచ్‌గా పనిచేస్తున్న జబీవుల్లా ఈనెల 22వ తేదీ నుంచి వారం రోజుల పాటు జరిగే ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డీ వాలీబాల్ లెవల్-1 కోర్సుకు అర్హత సాధించారు. భారత్ నుంచి ఎంపికైన నలుగురు కోచ్‌లలో జబీవుల్లా ఒకరు. దీంతో జబీవుల్లాకు డీఎస్‌డీఓ ఉదయ్ భాస్కర్, శాప్ కోచ్‌లు అభినందనలు తెలిపారు.

వినియోగదారులే దేవుళ్లు

- ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు



మాట్లాడుతున్న సీఎండీ సంతోష్‌రావు, పాల్గొన్న సిబ్బంది

పుట్టపర్తి రూరల్/అనంతపురం టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): 'వినియోగదారులే మనకు దేవుళ్లని, వారికి నాణ్యమైన విద్యుత్‌ను అందించి సంతృప్తిపర చాలని ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్ రావు విద్యుత్‌సిబ్బందిని ఆదేశించారు. బీడుపల్లి సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన విద్యుత్ సరఫరా, సానుకూల ప్రజా అవగాహన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన సర్వేలో పుట్టపర్తి, కదిరి, డివిజన్లలో కొన్నిమండలాల్లో వినియోగ దారులకు సంతృప్తికరమైన సేవలందించలేకపోయామనే విషయం తేలిందన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో పారిశ్రామికీకరణ కోసం ఆర్డీఎస్ఎస్ 222 ఫీడర్లకు సంబంధించి రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.

విద్యుత్ అంతరాయాలు ఉండకూడదు

విద్యుత్ అంతరాయాలు కలగకుండా చూడాలని సిబ్బందిని ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు ఆదేశించారు. జేఎన్టీయూ ఆడిటోరియంలో అనంతపురం జిల్లా విద్యుత్‌శాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. అంతకుముందు జిల్లాలోని పరిస్థితులపై అధికారులతో ఆరా తీశారు. రెవెన్యూ కలెక్షన్లు, విద్యుత్ అంతరాయాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్లపై చర్చించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్లు పాడైపోతే వాటి స్థానాల్లో వెంటనే మరొకటి ఏర్పాటు చేయాలన్నారు. మరమ్మతులకు వచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లను త్వరితగతిన పూర్తి చేయా లన్నారు. లైన్లు ఎక్కడెక్కడ దెబ్బతిన్నాయో వాటిని ముందుగానే గుర్తించి, వాటిని మార్పుచేసేలా చూడాలన్నారు. విద్యుత్ బకాయిలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సీజీఎం వరకుమార్, శ్రీసత్యసాయి జిల్లా ఎస్ఈ సంపత్‌కుమార్, అనంతపురం జిల్లా ఎస్ఈ శేషాద్రి శేఖర్, ఈఈలు రమేష్, రాజశేఖర్, డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేలో సదుపాయాలు మెరుగుపడాలి: దక్షిణ మధ్య రైల్వే జీఎం



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ

గుంతకల్లు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రైల్వే పరిధిలో ప్రజా సదుపాయాలు, ట్రాఫిక్ సౌకర్యాలు, పరిశుభ్రతా ప్రమాణాలు కాలానుగుణంగా మెరుగుపడాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సూచించారు. ఆయన బుధవారం ఉదయం నుంచీ రాత్రి వరకూ గుంతకల్లు రైల్వే డివిజన్‌లో పర్యటించారు. సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో వచ్చిన జీఎం తొలుత తిరుపతి, రేణిగుంట రైల్వే జంక్షన్లలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. తిరుపతిలో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద చేపడుతున్న పనులను సందర్శించారు. అభివృద్ధి పనుల విషయంగా గుంతకల్లు రైల్వే డివిజనల్ అధికారులతో చర్చించారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి కడప స్టేషన్‌లో జరుగుతున్న కన్‌స్ట్రక్షన్ వర్కులను తనిఖీ చేశారు. పర్యటనలో తిరుపతి నుంచి గుంతకల్లు వరకూ ప్రత్యేక రైలులో ట్రాక్, రైలు వంతెనల ప్రమాణాలను రీర్ విండోలో తనిఖీ చేశారు. సాయంత్రం గుంతకల్లుకు చేరుకుని స్థాని డీఆర్ఎం కార్యాలయంలో డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, వివిధ విభాగాల ఇన్‌చార్జి అధికారులతో డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు, వివిధ ప్రాజెక్టులు, స్టేషన్ల పునర్నిర్మాణ పనులు, ట్రాఫిక్ సదుపాయాలు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో హైదరాబాద్ డీఆర్ఎం సంతోష్‌కుమార్ వర్మ, జోనల్ అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరికి నీట్ పీజీలో ఉత్తమ ర్యాంకులు



సయ్యద్ షాహూర్ రఫత్ | శ్రీకృష్ణదేవరాయలు

అనంతపురం క్లాక్ టవర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నీట్ పీజీ ఫలితాల్లో జిల్లాకు చెందిన ఇద్దరు మెరుగైన ర్యాం కులు సాధించారు. అనంతపురం నగరంలో నివాసముంటున్న శోభారాణి తనయుడు శ్రీకృష్ణదేవరాయ లు నీట్ పీజీ ఫలితాల్లో జాతీయస్థాయిలో 1,330వ ర్యాంకు దక్కించుకున్నాడు. 800 మార్కులకుగాను 621 మార్కులు సాధించాడు. అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో శ్రీకృష్ణదేవరాయలు ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. ఆర్డీటీలో పనిచేస్తున్న ఫీల్డ్ డాక్టర్ సయ్యద్ హుస్సేన్ తనయుడు సయ్యద్ షాహూర్ రఫత్ ఆలిండియా స్థా యిలో 10,907 ర్యాంకు సాధించాడు. 800మార్కులకుగాను 551 మా ర్కులు వచ్చాయి. కడప రిమ్స్‌లో రఫత్ ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. రాష్ట్రస్థాయిలో 400వ ర్యాంకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

- కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

అనంతపురంరూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): డిగ్రీ నూతన ప్రవేశాలకు గురువారం నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యలత పేర్కొన్నారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ తదితర డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు కళాశాలలో రిజిస్ట్రేషన్ హెల్ప్‌సెంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇంటర్ హాల్‌టికెట్, కులధ్రువీకరణ పత్రం, మెయిల్ ఐడీ, ఫోన్ నెంబర్, బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్ కార్డ్‌ను తీసుకుని కళాశాలకు రావాలని సూచించారు. వివరాలకు 9440723244 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తు చేసుకోండి

కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సత్యలత తెలిపారు. తెలుగు, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్, సంస్కృతం సబ్జెక్టులకు గెస్ట్ ఫ్యాకల్టీని నియమిస్తామన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ, ఆపైగాని ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు.

టీచర్ల అంతర్‌జిల్లా బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

అనంతపురం విద్య, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల అంతర్‌జిల్లా బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కొన్నేళ్లుగా ఈ బదిలీల కోసం అనేక మంది ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీలు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసికెళ్లడంతో అంతర్‌జిల్లా బదిలీలకు ఆమోదం తెలిపారు. బుధవారం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ అంతర్‌జిల్లా బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ బదిలీలలో కేవలం ఇరు పక్కల టీచర్ల కేడర్‌కు మాత్రమే అవకాశం కల్పించారు. బదిలీ కోరుకునే టీచర్లు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అపుడే పలువురు టీచర్లు మ్యూచువల్ కోసం వాట్సాప్ గ్రూపులలో విల్లింగ్ అడుగుతూ మెసేజ్‌లు పెడుతున్నారు.

ఉత్తమ టీచర్ల అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

అనంతపురం విద్య, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 5న జిల్లా స్థాయి ఉత్తమ టీచర్ల అవార్డులు ప్రదానం చేస్తామని, ఈ మేరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, మోడల్‌స్కూల్స్, కేజీబీవీలు, రెసిడెన్సియల్ స్కూల్స్, డైట్ కళాశాలలో పనిచేస్తున్న ప్రిన్సిపాల్స్, హెచ్ఎంలు, టీచర్లు అర్హులని పేర్కొన్నారు. కనీసం 10 ఏళ్ల సర్వీస్ ఉండాలని, గతంలో జిల్లా స్థాయి అవార్డు పొంది ఉండకూడదని, ఎలాంటి క్రిమినల్ కేసులు నమోదై ఉండకూడదని, శాఖాపరమైన చర్యలు ఉండరాదని పేర్కొన్నారు. జాతీయ స్థాయి అవార్డులకు దరఖాస్తు చేసిన టీచర్లు ఇందుకు అనర్హులని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న టీచర్లు ఈనెల 28 సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు జిల్లా కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందని డీఈఓ పేర్కొన్నారు.

49 మందికి ఉద్యోగోన్నతి

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో 49 మందికి గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు బుధవారం ప్రకటనలో తెలిపారు. డీపీఓ, డీఎల్‌పీఓ కార్యాలయాల సిబ్బంది, అర్హత కలిగిన గ్రేడ్-4 సెక్రటరీలు, జూనియర్ అసిస్టెంట్ కేటగిరీ, జేఏబీసీల ఫీడర్ కేటగిరీల నుంచి అర్హతలు పరిశీలించి గ్రేడ్-3 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

ఏపీ నిట్‌లో
బీటెక్ విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో బీటెక్ విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన బుధవారం నుంచి ప్రారంభమైంది. నిట్ విద్యాసంస్థలో మొత్తం 8 కోర్సులు నిర్వహిస్తుండంగా ఆయా కోర్సులలో మొత్తం 484 సీట్లు ఉన్నాయి. వీటిలో 50 శాతం సీట్లను రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు కేటాయిస్తారు. మిగిలిన సీట్లను జోసా, సీసాట్ కౌన్సెలింగ్ ద్వారా ఇతర విద్యార్థులతో భర్తీ చేయనున్నారు. ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 2025-26 సంవత్సరానికి సంబంధించి అన్ని సీట్‌లకు కేటాయింపులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పరిశీలన కేంద్రంలో విద్యార్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకోవడంతో పాటు ఫీజులు చెల్లించి కోర్సులలో చేరుతున్నారు. ఈ కార్యక్రమం ఈనెల 23వ తేదీ వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని నిట్ అధికారులు తెలిపారు. అడ్మిషన్ల విషయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నట్టు డీన్ అకడమిక్ డాక్టర్ ఎన్.జయరాం తెలిపారు. తొలి రోజు మొత్తం 86 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందినట్టు తెలిపారు.

కొంతే మార్పు

- శిక్షణకు రెండో రోజు నలుగురే హాజరు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభు త్వం మహిళా ప్రజాప్రతినిధుల కోసం ఏర్పాటు చేసిన మార్పు కార్యక్రమానికి బుధవారం నలుగురు మాత్రమే హాజరయ్యారు. మహిళా ప్రజాప్రతినిధుల చైతన్యం కోసం మార్పు ద్వారా విజేతలు .. మహి ళా సాధికారితతో స్వపరిపాలన సాధ్యం అను అంశంపై మూడు రోజుల పాటు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో ఏర్పాటు చేశారు. మంగళవారం ఇద్దరు మాత్రమే హాజరుకాగా బుధవారం నలుగురు మాత్రమే హాజరయ్యారు. బత్తలపల్లి, రాయదుర్గం ఎంపీపీలు, రాప్తాడు, అమరాపురం జడ్పీటీలు మాత్ర మే హాజరయ్యారు. గురువారం మూడోరోజు శిక్షణ ముగియనుంది.

రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం

- వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- జేఎన్‌టీయూలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌ను జేఎన్‌టీయూఏలో బుధవారం అట్టహాసంగా ప్రారంభించారు. మంగళగిరి రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌తోపాటు రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లో ఆర్‌టీఐహెచ్‌స్పోక్‌లను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. స్థానికంగా కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పరిటాల సునీత సెంటర్‌ను ప్రారంభించారు. ముందుగా రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌లో వివిధ సంస్థలు, స్టార్టప్స్, పరిశ్రమల ప్రతినిధులు ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించి వారి నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ అవసరాలు తీర్చే స్టార్టప్‌గా ఈ సెంటర్ అభివృద్ధికి కార్యాచరణను సిద్ధం చేసినట్లు తెలిపారు. కుటుంబానికో పారిశ్రామిక వేత్త నినాదం సాకారంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా గ్రిడ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో నాలెడ్జి పార్టనర్‌గా సెంట్రల్‌యూనివర్సిటీ, జేఎన్‌టీయూలు ఉన్నాయని, ఈ ఇన్నోవేషన్ హబ్‌కు డైరెక్టర్‌గా జిల్లా కలెక్టర్ తరఫున జాయింట్ కలెక్టర్ ఉన్నారని తెలిపారు. జిల్లాలో వివిధ రకాల పరిశ్రమలు, సంస్థలు ఉన్నాయని, అనంతపురం, కర్నూలు ఉమ్మడి జిల్లాలో ఉన్న విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కృష్ణయ్య, స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, కియ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి రవిశంకర్‌రెడ్డి, జేఎస్‌డబ్ల్యూగ్రూప్ ప్రతినిధి పసుపాలక్, రేమాండ్స్ గ్రూప్ ప్రతినిధి నవీన్ శర్మ, భారత్ ఫోర్జ్ యోగేష్‌ఇనాంధర్, అల్ట్రాటెక్ ప్రతినిధి గోపాల్‌రెడ్డి, అర్జస్‌స్టీల్స్ నరేందర్, సిప్లాన్ ప్రతినిధి చౌదరి, అటల్ ఇంకుబేషన్ చంద్రమౌళి, ఆర్డీఓ కేశవనాయుడు, జిల్లా పరిశ్రమల శాఖ ఏడీ రాజశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ హరికుమార్, ఆర్అండ్‌బీ డీఈ రాజగోపాల్, జేఈ బాలకాటమయ్య తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్ తదితరులు

125 ఎకరాల్లో మినుముల సాగు



పడమర నడింపల్లి వద్ద పొలంలో మినుములు చల్లుతున్న రైతులు

నంబులపూలకుంట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో 125 ఎకరాల్లో మినుము పంట సాగు చేస్తున్నట్లు ఏఓ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వెలిచెలమల, గౌనపేట, వంకమద్ది, ధనియాన్‌చెరువు, దిగువతూపల్లి గ్రామాల పరిధిలో పంట సాగును ఆయన పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. విత్తన శుద్ధి దశ నుంచి పంట కోతవరకు పాటించాల్సిన యజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ఎకరాకు 8 నుంచి 10 కిలోల విత్తనాలు విత్తుకోవాలన్నారు. ఆ సమయంలో హెక్టారుకు 20 కేజీల చొప్పున నత్రజని, భాస్వరం, పది కేజీల జింక్ సల్ఫేట్ దుక్కిలో వేసి కలియదున్నాలన్నారు. పదినుంచి 20రోజుల పైరు దశలో పార్మలా 4 పిచికారీ చేసుకోవాలన్నారు. కలుపు నివారణకు పిండి మిథాలిన్ 30శాతం 1.5 లీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి మరుసటిరోజు నేల అంతా తడిసేలా పిచికారీ చేసుకోవాలన్నారు. 70నుంచి 80రోజుల్లో పంట చేతికొస్తుందన్నారు. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో రైతులు విజయ్‌కుమార్‌యాదవ్, చంద్రమోహన్‌రెడ్డి, వేణుగోపాల్, రైతు సేవా కేంద్రం సిబ్బంది కుమారి, రాధ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం



మాట్లాడుతున్న ఈగల్‌సెల్ ఇన్‌చార్జ్ హనుమంతు

అనంతపురం క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి, తదితర మత్తు పదార్థాలతో జీవితాలు నాశనమవుతాయని, విద్యార్థులు, యువత వాటికి దూరంగా ఉండాలని ఈగల్ సెల్ అనంతపురం ఇన్‌చార్జ్, ఎస్ఐ హనుమంతు సూచించారు. బుధవారం నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. పోస్టర్లు ఆవిష్కరించి, విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, నషా ముక్త్ భారత్‌గా మార్చడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల శారీరక, మానసిక రుగ్మతలు వస్తాయని, అనారోగ్యం బారిన పడుతారని అన్నారు. మత్తు పదార్థాల వినియోగిస్తే భారీగా శిక్షలు పడతాయని తెలిపారు. కార్యక్రమంలో విలకలాంగుల సంక్షేమ శాఖ అధికారి అనిల్‌కుమార్, ఆర్ట్స్ కళాశాల లెక్చరర్ బృందా, అధ్యాపకులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో చిరుజల్లులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం చిరుజల్లులు పడ్డాయి. అనంతపురం, పుట్లూరు, గార్లదిన్నె, ఉరవకొండ, బెలుగుప్ప, విడపనకల్లు, పామిడి తదితర ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. జిల్లాలోని 8 మండలాల్లో మంగళవారం వర్షం పడింది. అత్యధికంగా కణేకల్లులో 5.2 మి.మీ వర్షం కురిసింది. డి.హిరేహాల్ 4.6, బ్రహ్మసముద్రం 4.2, విడపనకల్లు 2.8, గుత్తి, కుందుర్పి 2.2, రాయదుర్గం 2.0, పెద్దవడుగూరు 1.2 మి.మీ వర్షపాతం నమోదయింది.

ఉగ్రవాదుల సమాచారం తెలపండి

ధర్మవరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పట్టణ, రూరల్ ప్రాంతాల్లో పాకిస్తాన్ ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నట్లుగా లేదా ఉగ్రవాదాన్ని ప్రేరేపించే వ్యక్తులు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఉగ్రవాదుల సమాచారాన్ని తెలిపితే పోలీస్‌శాఖ తరపున బహుమతులు కూడా అందజేస్తామని డీఎస్పీ తెలిపారు. వన్‌టౌన్ సీఐ-9440796831, టూటౌన్ సీఐ 6305800429, రూరల్ సీఐ-9440796832 నెంబర్లకు సమాచారాన్ని అందించాలన్నారు.

కలెక్టర్ అనుమతి ఇచ్చారా..!

- నేడు సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులకు ఇంటర్వ్యూలు..?

కొత్తచెరువు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఏలోని సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టుల భర్తీకి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమైనట్లు తెలిసింది. జిల్లాలో 10 పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశారు. ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. నిబంధనల మేరకు అర్హులు, అనర్హుల జాబితాను నోటీసు బోర్డులో పెట్టాలి. ఆ తరువాతే ఇంటర్వ్యూలు నిర్వహించాలి. కానీ ఇదేమీ లేకుండా గుట్టుచప్పుడుగా కాకుండా ఇంటర్వ్యూలకు సిద్ధమయ్యారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొందరు తెలిపారు. ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు కలెక్టర్ అనుమతి కోసం తపాల్ పెట్టామని, అనుమతి రాగానే నిర్వహిస్తామని ఎస్ఎస్ఏ ఏపీసీ దేవరాజ్ అన్నారు. కానీ ఇప్పటికే ఇంటర్వ్యూలకు సిద్ధమయ్యారని, గురువారం నిర్వహిస్తారని ప్రచారం జరుగుతోంది.

కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రొనాల్డ్ రాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైద్యులు

అనంతపురం వైద్యం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులు, వర్షాలతో దోమలు వ్యాప్తి చెంది కాలానుగుణ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందనీ, అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి.. అధికారులకు సూచించారు. బుధవారం రొనాల్డ్ రాస్ జయంతిని పురస్కరించుకుని ప్రపంచ దోమల నివారణ దినం నిర్వహించారు. రొనాల్డ్ రాస్ చిత్రపటానికి నివాళులర్పించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయన్నారు. దోమలు పెరిగి, సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి ఓబులు, డెమో త్యాగరాజు, హెచ్ఈఓ నాగరాజు, గంగాధర్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మోడల్ స్కూల్ తనిఖీ

ధర్మవరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుట్టకిందపల్లి వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌ను అకడమిక్ మానిటరింగ్ అధికారి సలీంబాషా బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం, హాస్టల్‌లోని వసతులు, ఐఐటీ, నీట్, విద్యాశక్తి క్లాసులు గురించి అడిగితెలుసుకున్నారు. తరగతి గదుల్లో విద్యార్థుల నోట్ పుస్తకాలను తనిఖీచేశారు. విద్యార్థులతో మాట్లాడి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

బత్తలపల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ స్థానిక కార్యాలయంలో బుధవారం ఇద్దరికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను టీడీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి ఆ పార్టీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నారాయణ రెడ్డి మాట్లాడుతూ మండలానికి చెందిన ఇద్దరికి రూ.1.20లక్షల చెక్కులను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకు లు రమణ, మనోజ్, సదాశివ, సురేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా వినాయక చవితి జరుపుకోవాలి: సీఐ

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వినాయ చవితి ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. వారు బుధవారం పోలీస్ స్టేషన్ ఆవరణంలో అన్ని మతాల పెద్దలు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. విగ్రహాల ఏర్పాటుపాటు నిమజ్జనం సమయంలోనూ శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. విగ్రహాల ఏర్పాటుకు తప్పకుండా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. అవాంచనీయ ఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు బాధ్యత వహించాలన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా, ప్రశాంత జీవనం గడపాలని గంగిరెడ్డిపల్లి వాసులకు సీఐ సురేష్‌కుమార్ సూచించారు. డీఎస్పీ విజయ్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లిలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో సోదాలు చేశారు. గ్రామంలో గొడవలు, దౌర్జన్యాలు, కొత్తవ్యక్తుల సంచారం, గంజాయి, అక్రమ మద్యం విక్రయం, కొనుగోలు వంటి కార్యక్రమాలు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ తెలిపారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధర్మవరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను బుధవారం పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు తుంపర్తి పరమేశ్, తాహీర్, సాయిరాజు, దైల, తిమ్మప్ప, రాజు, మునాఫ్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్‌కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీచేశారు.

విలువలు అలవరచుకోవాలి: హెచ్ఎం

కదిరి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి నైతిక విలువలు అలవరుచుకుని నీతి, నిజాయతీతో మెలగాలని తలుపుల ప్రభుత్వ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సావిత్రి పేర్కొన్నారు. పాఠశాలలో బుధవారం నిజాయతీ పెట్టెను ప్రారంభించారు. ఆ పెట్టెలో విద్యార్థులకు అవసరమైన పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు తదితర సామగ్రిని వేయాలన్నారు. అవసరమైన వారు వాటిని తీసుకునేలా జీవశాస్త్ర ఉపాధ్యాయులు తలమర్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుకన్య, శివనారాయణ, ముంతాజ్‌బేగం, కవిత, దివాకర్, శ్రీనివాసులు, పవన్, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

గాండ్లపెంట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లమీదపల్లి పంచాయతీలో సమాచార హక్కు చట్టంపై బుధవారం పట్టుపరిశ్రమ శాఖ ఏడీ వెంకటస్వామినాయక్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉంటే కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఈవీ రమణమ్మ, భాస్కర్‌రెడ్డి, బాబా ఫకృద్దీన్, మధుసూధన్‌రెడ్డి, స్వర్ణ కుమారి, మనోహర్, ప్రజలు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు ప్రారంభం

నల్లమాడ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో మొదమొదటసారి బుధవారం వైద్యాధికారి బాబ్‌జాన్ ఓ మహిళకు శస్త్రచికిత్స నిర్వహిం చారు. ఆయనతో పాటు మహిళ వైద్యాధికారి అత్తరున్నీసా మాట్లాడుతూ... ఈ ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు ప్రారంభించామన్నారు. మండలంలోని గర్భిణులు ప్రసవ సమయంలో ఇబ్బందిగా ఉంటే ఆసుపత్రికి వచ్చి చికిత్సలు చేయించుకోవాలన్నారు. అవసరమైతే శస్త్రచికిత్సలు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారితో పాటు చిన్నపిల్లల వైద్యునిపుణులు సాయికుమార్, ఓటీ అసిస్టెంటు నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



నాగరాజు (ఫైల్)

తనకల్లు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రంబైలు గ్రామానికి చెందిన నాగరాజు(39) గ్రామ సమపం లోని వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసైన నాగరాజు ప్రతిరోజు మద్యం తాగేవాడు. మృతుడు అర ఎకరా పొలంలో టమోట పంట సాగుచేశాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి వెనుకనే ఉన్న టమోటా తోటలోకి వెళ్లి టేకు చెట్టుకు డ్రిప్ పైపుతో ఉరివేసుకుని మృతిచెందాడు. కుటుంబ సభ్యులు విషయాన్ని తెలుసుకుని పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బీజేపీ నాయకుల సమావేశం

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు ఇడగొట్టు వీరాంజనేయుల ఆధ్వర్యంలో సంచార, అర్ధ సంచార జాతుల విముక్తి దినోత్సవంపై సమావేశం నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 30న శనివారం విజయవాడలో సంచార జాతుల విముక్తి దినోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలం నుంచి వివిధ కులవృత్తులకు చెందిన వారిని ఈ కార్యక్రమానికి తరలించాలని కోరారు.

గుంతల రహదారులు

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
● ప్రమాదాలతో బెంబేలు



అధ్వానంగా మల్లాకాల్వ-ధర్మవరం రహదారి



గొట్లూరు-సుబ్బరావుపేట రహదారి ఇలా...

ధర్మవరం రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తమ గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ప్రయాణం చేయాలంటే నరకప్రాయంగా ఉందని మండలంలోని పలు గ్రామప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మల్లాకాల్వ, దర్శినమల, ఓబుళనాయునిపల్లి, నేలకోట, ఏలుకుంట్ల తదితర గ్రామాల నుంచి ధర్మవరానికి వెళ్లే రహదారి చాలా ఆధ్వానంగా తయారైంది. గుంతలు ఏర్పడి, కంకరతేలి ప్రయాణానికి కష్టతరంగా మారింది. ఈ గ్రామాల నుంచి ప్రతి రోజు ధర్మవరానికి ఆటోల్లో, ద్విచక్రవాహనాలు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఈ రహదారిలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాని తెలిపారు. గొట్లూరు నుంచి సుబ్బరావుపేటకు వెళ్లే రోడ్డంతా దెబ్బతి గుంతలు ఏర్పడ్డాయి. ప్రధానంగా ఓబుళనాయునిపల్లి కొండ, సుబ్బరావు పేట గ్రామాల నుంచి మట్టిని అక్రమంగా భారీ వాహనాల్లో తరలిస్తుండటంతో రోడ్లన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయని ఆయా గ్రామస్థులు పేర్కొంటున్నారు. మట్టిని తోలేటప్పుడు కూడా వాహనాలు వేగంగా వస్తున్నాయని దీంతో మట్టి అంతా రోడ్లపై పడిఉండటంతో ఆ రహదారు ల్లో జారిపడి ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు తెలుపుతు న్నారు. పోలీసు, అధికారులు స్పందించి వాహనాల వేగాన్ని నియంత్రించి, రహదారులను బాగుచేయాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దుదాం

● మున్సిపల్ కమిషనర్, వయోజన విద్య నోడల్ అధికారి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

కదిరి, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుదామని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, వయోజన విద్యాశాఖ నోడల్ అధికారి జనార్దన్ పిలుపునిచ్చారు. నిరక్షరాస్యులను చదువరులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమంపై బుధవారం మున్సిపల్ కార్యాలయంలో అవగాహన సద స్సు నిర్వహించారు. ఈ సదస్సులో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, వయోజన విద్యాశాఖ నోడల్ అధి కారి జనార్దన్ మాట్లాడుతూ... 15 ఏళ్ల నుంచి 59 మధ్య నిరక్షరాస్యులైన వయోజనులకు సాంకేతికత, వయోజన విద్య అందుబాటులోకి తెచ్చే కార్యక్రమమే అక్షరాంధ్ర అన్నారు. కనీసం పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఎవరైనా స్వచ్ఛంద బోధకులుగా ఒక్కొక్కరు కనీసం పది మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలన్నారు. రానున్న రోజుల్లో వయోజనులను వందశాతం అక్షరాస్యులుగా మార్చడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. ఉపాధి, వెలుగు, మెప్మా, మహిళా సంఘం సభ్యులు, అంగన్‌వాడీ ఆయాలు, ఆ శాఖ ద్వారా లబ్ధి పొందుతున్న గర్భిణులు, బాలింతల్లో నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా మార్చాలని సూచించారు. త్వరతగతిన నిరక్షరాస్యులను గుర్తించి జాబితా తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ పర్యవేక్షకులు సుధాకర్, రవీంద్రనాయుడు, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ శివకుమార్, టీపీఓ సతీష్‌కుమార్, సీఓ గిరీష్, సూపర్‌వైజర్ మురళీక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుడి ఊరేగింపు



ముదిగుబ్బలో శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు

ముదిగుబ్బ/బత్తలపల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రబోధానంద సేవా సమితి, త్రైత సిద్ధాంతం సభ్యుల ఆధ్వర్యం శ్రీకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్ షెల్టర్‌లో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఈనెల 16న కృష్ణుడి ప్రతిమను ఏర్పాటు చేసి నాలుగు రోజులు ప్రత్యేక పూజలు చేశారు. ఐదోరోజు బుధవారం శ్రీకృష్ణుడి ప్రతిమను పల్లకిలో ఉంచి గ్రామోత్సవం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసీల్దార్ నారాయణ స్వామి, ముదిగుబ్బ సీఐ శివరాముడు, రూరల్ సీఐ శ్యామరావు హాజరయ్యారు. పల్లకిని ఎత్తుకొని ఊరేగింపు ప్రారంభించారు. కృష్ణుడి వేషధారణలో చిన్నారులు అలరించారు. ప్రబోధసేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బత్తలపల్లి ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడి ప్రతిమను బుధవారం మండలకేంద్రంలో ఘనంగా ఊరేగించారు.

బార్లకు దరఖాస్తు చేసుకోండి

● ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

ధర్మవరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన నూతన బార్లకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని అనంతపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో బుధవారం పాత బార్ల లైసెన్స్ దారులు, ఏ-4 షాపు లైసెన్స్‌దారులు, కొత్తగా బార్లకు దరఖాస్తులు చేసుకునేవారికి ఆయన బుధవారం నూతన బార్లకు సం బంధించిన వివరాలను వెల్లడించారు. ధర్మవరంలో మూడు బార్లకు నూతనంగా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిదని తెలిపారు. ఈనెల 26వతేదీలోగా ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ధర్మవరంశాఖ ఎక్సైజ్‌శాఖ సీఐ చంద్రమణి పాల్గొన్నారు.

● కదిరి: పట్టణంలో మూడు మద్యం బార్లు మంజూరయ్యాయని, వాటికి దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ శాఖ ఉమ్మడి జిల్లాల డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య పేర్కొన్నారు. పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఆయన బుధవారం రెస్టారెంట్ లైసెన్సు దారులు, మద్యం దుకాణ దారులు, స్థానికులతో సమావేశం నిర్వహించారు. కదిరి మున్సిపాలిటీ పరిధిలో మూడుకిలోమీటర్ల దూరంలో ఎక్కడైనా కొత్తగా మంజూరైన బార్ పెట్టుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు నరసింహులు, రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ కనబరచిన విద్యార్థినికి అభినందనలు

ధర్మవరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మల్టీస్టార్ ఆలిండియా బుడోఖాన్ కరాటే అకాడమీ విద్యార్థి గంధోడి నాని రాష్ట్రస్థాయి కరాటేలో ప్రతిభ కనబరచి కడప స్పోర్ట్స్ స్కూల్‌లో ఫ్రీ సీటు సాధించిందని కరాటే మాస్టర్లు ఇనాయత్‌బాషా, నవ్యశ్రీ తెలిపారు. గత నెల 22వ తేదీన గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో సత్తాచాటి కడప స్పోర్ట్స్‌స్కూల్‌లో ఫ్రీ సీటు సాధించిందన్నారు. ఇందుకు సంబం ధించి బుధవారం కడప స్కూల్‌లో జాయిన్ కావాలనిలెటర్ వచ్చిందన్నారు. ఆ విద్యార్థిని టీడీపీ నాయకులు సంధా రాఘవ తదితరులు అభినందించారు.

దోమల నిర్మూలనపై ర్యాలీ



ప్రశాంతి గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దోమల నివారణ దినం పురస్కరించుకుని జిల్లా డిప్యూటీ వైద్యాధికారి డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రం ప్రశాంతిగ్రామంలో దోమల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ మాటాడుతూ... దోమల వలన వ్యాపించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియ అధికారి లక్ష్మీనాయక్, డిప్యూటీ డెమో బాబాఫకృద్దీన్ సిబ్బంది పాల్గొన్నారు.

● ధర్మవరం/నంబులపూలకుంట: ప్రతిఒక్కరు రాత్రిళ్లు తప్పకుండా దోమతెరలు వాడాలని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ తిప్పేంద్రనాయక్ సూచించారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి నుంచి చేపట్టిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. వైద్యులు హరి, శ్రీనివాసులు, సురేశ్‌నాయక్, మలేరియా సబ్‌యూనిట్‌అధికారి జయరాంనాయక్, ఏఓ భాస్కర్, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే నంబులపూలకుంటలో ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా స్థానిక వైద్యశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి ఆనంద్‌వర్ధన్, వైద్యసిబ్బంది, మలేరియా సబ్‌యూనిట్ అధికారులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పీఏసీఎస్ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన కార్యవర్గం

కదిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తలుపుల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా బండా ఓబులరెడ్డి, డైరెక్టర్లుగా వెంకట క్రిష్టయ్య, చౌడయ్య కార్యాలయంలో బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు నూతన కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ముబారక్ నాయకులు రాజారెడ్డి, శ్రీనివాసులు, రామక్రిష్టారెడ్డి, నారాయణరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, నరసింహులు, రాజా, చిన్నరెడ్డెప్ప, చక్ర, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాలువ పనులకు భూమిపూజ

ముదిగుబ్బ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ నుంచి మండలంలోని చెరువులకు నీరు వదిలేందుకు కాలువ నిర్మాణం కోసం బుధవారం టీడీపీ మండల నాయకులు భూమిపూజ చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ చొరవతో మల్లమ్మ కొట్టాల సమీపంలో హంద్రీనీవ కాలువ నుంచి కృష్ణా జలాలను మండలంలోని చెరువులను నింపడానికి కాలువ పనులు ప్రారంభించామని తెలిపారు. ఈ కాలువ ద్వారా ముదిగుబ్బ చెరువు, వడ్డన్న కుంట నుంచి కుడివైపున వలిమి చెర్లోపల్లి, సంకేపల్లి చెరువులకు నీరు చేరుతుందన్నారు. అలాగే వడ్డన్న కుంట నుంచి జిల్లేడుబండ వాగులోకి, అటు నుంచి ఎడమవైపుకు సప్లై చానల్ ద్వారా గుంజేపల్లి, బ్రహ్మదేవరమర్రి చెరువులకు కృష్ణా జలాలు చేరుతాయన్నారు. టీడీపీ నాయకులు రమేష్‌బాబు, కరణం ప్రభాకర్, తుమ్మల మనోహర్, కోట్ల బాబి, సోమల ప్రకాష్, వినోద్‌బాబు, కొలసాని చంద్ర, బండి మల్లికార్జున, మల్లెల నారాయణస్వామి, ఇరిగేషన్ డీఈ ప్రసాద్‌రావు, మైనర్ ఇరిగేషన్ ఏఈ గురుప్రసాద్, ఏఈ షబానా పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతల్లో నీరు

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ప్రజలు



లోచర్ల పాఠశాల వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కొత్తచెరువు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లోచర్లలో పెనుకొండ రహదారి పక్కనే ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉంది. పాఠశాలకు ఎదురుగా రోడ్డు గుంతల మయం కావడంతో ఇటీవల వర్షాలకు ఆ గుంతల్లో వర్షపు నీరు నిలిచింది. దీంతో పాఠశాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ప్రతిరోజు ఈ రహదారి గుండా కియా కార్ల పరిశ్రమకు వందల సంఖ్యలో బస్సులు నిత్యం వెళ్తుంటాయి. ఆ బస్సులు వెళ్లే సమయంలో గుంతలలోని నీరు తమపై పడుతోందని విద్యార్థులు వాపోతు న్నారు. రోడ్డు గుంతలమయం కావడంతో వాహనదారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది ప్రమాదాలకు సైతం గురవుతున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. పలుమార్లు ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ అధికారులకు విన్నవించినా పట్టించు కోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల వద్ద రోడ్డుపై పడిన గుంతలను పూడ్చాలని గ్రామస్థులు, విద్యార్థులు కోరుతున్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో ప్రతిష్ఠించిన విగ్రహాలు

అమడగూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని నిలువురాతి పల్లిలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠను బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులంతా కలిసి రూ. కోటి వ్యయంతో గ్రామంలో నూతనంగా రామాలయం నిర్మించారు. ప్రధాన పౌరోహితులు మునికోటి కోదండపాణి శర్మ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా 15 మంది వేద పండితులు గణపతి పూజ, కలశస్థాపన, హోమాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ధ్వజప్రతిష్ఠతో పాటు శివుడు, నంది, వినాయకుడు, నవగ్రహాలను ప్రతిష్ఠించారు. బుధవారం సీతారామలక్ష్మణ ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ చేసి, సాయంత్రం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. గురువారం శ్రీరాముల పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు పండితులు తెలిపారు. కడపజిల్లా బ్రహ్మంగారిమఠం మండలంలోని కమ్మవారిపల్లికి చెందిన లక్ష్మీనాయుడు, గుర్రమ్మ దంపతులు 26.5 అడుగుల ఎత్తుగల ధ్వజస్తంభం విరతణ చేశారు. గ్రామంలో ఐదురోజుల పాటు రామాలయం వద్ద కోలాటం, చెక్కభజన, కోదండరామభజన లాంటి కార్యక్రమాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.



సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

బలవంతపు భూసేకరణ ఆపాలి

● ఏపీ రైతు సంఘం నాయకులు

ధర్మవరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల అనుమతి లేకుండా కార్పొరేట్ కంపెనీల కోసం చేపట్టే బలవంతపు భూసేకరణ ఆపాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న డిమాండ్‌చేశారు. రైతుసంఘం స్థానిక కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లూరు జిల్లా కరేడు గ్రామంలో ఇండోసోల్ కార్పొరేట్ కంపెనీ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఆ గ్రామ రైతులను అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. జిల్లాలో సోలార్ ఏపీఐఐసీ కోసం దాదాపు 60వేల ఎకరాలతో పాటు ఎన్‌పీ కుంట, హిందూపురం, మడకశిర, రొద్దం ప్రాంతాలలో బలవంతపు భూసేకరణ చేశారని ఆరోపించారు. ఆ భూసేకరణ ఆపాలని లేకపోతే రైతుసంఘం, సీపీఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్‌హెచ్ బాషా, సీఐటీయూ నాయకులు జేవీ రమణ, అయూబ్‌ఖాన్, వెంకటస్వామి పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దృఢత్వం: డీఎస్పీ

● వాజ్‌పేయి స్మారక క్రికెట్ టోర్నీ ప్రారంభం



టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

ధర్మవరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయని డీఎస్పీ హేమంత్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ జన్మదినం సందర్భంగా బుధవారం ఆర్డీటీ స్థానిక క్రీడామైదానంలో అటల్ బిహారీ వాజ్‌పేయి స్మారక సీజన్-2 క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా డీఎస్పీ హేమంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ హాజరయ్యారు. మొదటి మ్యాచ్‌ను డీఎస్పీ టాస్ వేసి ప్రారంభించారు. మొదటిమ్యాచ్‌లో పోతుకుంట బ్లూకాప్స్, చత్రపతిజట్లు తలపడగా రెండు పరుగుల తేడాతో బ్లూకాప్స్ జట్టు గెలిచింది. రెండోమ్యాచ్‌ను బీజేపీ సీనియర్ నాయకులు శ్యాంకుమార్ ప్రారంభించారు. సేవ్ ఫార్మర్స్ జట్టు గణిలెవెన్స్ జట్టుపై 52 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబుళేశు, రూరల్ అధ్యక్షుడు గొట్లూరుచంద్ర, ఆర్డీటీ ఏటీఎల్ శ్రీనివాసులు, కోచ్‌లు రాజశేఖర్, పృథ్వీ, అనిల్, అంబటి సతీశ్, బిల్లేశ్రీనివాసులు, పోతుకుంట రాజు, గంగాధర్, చిన్నలింగమయ్య, అంజి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు రైతు వినతి

నల్లచెరువు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తమ దాయాది, వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్న రంగస్వామి తమ భూమిని అక్రమంగా ఆన్‌లైన్‌లో ఆయన పేరిట ఎక్కించుకున్నాడని మండలంలోని ఓరువాయి గ్రామానికి చెందిన చిన్నరెడ్డెప్ప అనే రైతు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. డీటీని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కలిశారు. దీనిపై ఆరేళ్లుగా రెవెన్యూ కార్యాలయం, కలెక్టరేట్‌కు తిరిగి వినతిపత్రాలు ఇచ్చామన్నారు. రెవెన్యూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులతో వీఆర్‌ఓ నిర్మల తమ నుంచి ఎటువంటి డబ్బులు తీసుకోకుండానే సాగు హక్కు ప్రకారం సమానంగా తమకు ఆన్‌లైన్‌లో ఆస్తిని ఎక్కించారని వివరించారు. వీఆర్‌ఏ రంగస్వామి పురుగుల మందు తాగి, వీఆర్‌ఓ నిర్మలపై చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు.

'దేవాలయ భూముల సంరక్షణకు చర్యలు'

కదిరి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): దేవాలయ భూములు సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు దేవాలయ ప్రాంతీయ కమిషనర్ చంద్రశేఖర్‌ఆజాద్, సంయుక్త కమిషనర్ పట్టెం గురుప్రసాద్ పేర్కొన్నారు. వారు బుధవారం పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సమావేశం నిర్వహించారు. దేవాలయ భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిని రక్షించేందుకు దేవాదాయ శాఖ చర్యలు తీసుకుంటోందన్నారు. గతంలో మండలాలవారీగా రెవెన్యూ సదస్సులు జరిగినప్పుడు దేవాలయ భూములను గుర్తించామన్నారు. ప్రస్తుతం వాటిని సంరక్షించడానికి చర్యలు తీసుకునేలా అధికారులతో సమావేశం నిర్వహించామని తెలిపారు.

న్యూస్ బాక్స్

వైభవంగా శ్రీకృష్ణాష్టమి



కలశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

అమరాపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్ల మారనపల్లి గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను యాదవ యువక సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. బుధవారం ఇళ్ల నుంచి మహిళలు హారతులు మోస్తూ, సాంస్కృతి కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారి చిత్రపటాన్ని ట్రాక్టర్లో ప్రతిష్ఠించి ఊరేగింపు చేశారు. వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. యాదవ యువక సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గంధంపూజ



గంధాన్ని ఊరేగింపుగా తెస్తున్న మతపెద్దలు

పెనుకొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని జాతీయరహదారి పక్కన వెలసిన హజరత్ సయ్యద్ బెహలూల్‌షా ఖాద్రి 828వ గంధంపూజ బుధవారం తెల్లవారుజామున ఘనంగా నిర్వహించారు. ఉదయం దర్గాపీఠాధిపతి ఆదోని షెక్షావలి ఇంటివద్ద నుంచి గంధాన్ని తలపై ఉంచుకుని మతపెద్దలు, పుర ప్రముఖులు వెంటరాగా ఫక్కీర్ల విన్యాసాలతో దర్గాకు తీసుకెళ్లి స్వామిసమాధివద్ద ప్రార్థనలు చేశారు. స్వామికి పూలచాదర్, గలాఫ్ సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, ఏజీపీ భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ సర్పంచ్ కుల్లాయప్ప పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

సోమందేపల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు సమూలంగా అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సీడీపీఓ శాంతలక్ష్మి కోరారు. బుధవారం మండలంలోని పాపిరెడ్డిపల్లి వద్దనున్న కేజీబీవీలో విద్యార్థినులకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. వాటివల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. తల్లిదండ్రులు సమాజంలో ప్రముఖులు బాల్యవివాహాల నివారణకు కృషిచేయాలన్నారు. విద్యార్థినులు చదువుపై శ్రద్ధవహించాలన్నారు. కేజీబీవీలో సఖీ గ్రూపును ఏర్పాటు చేసుకోవడం ద్వారా ప్రతివారం సమావేశాలు నిర్వహించి, ప్రాధాన్యతగల అంశాలను చర్చించేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనికి సోషల్ టీచర్ నోడల్ అధికారిగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. అత్యవసరమైన సాయం కోసం 1098, 100, 181కు సమాచారం అందించాలన్నారు. బాలల పరిరక్షణ విభాగం అధికారి నాగలక్ష్మి, ఎస్‌ఓ అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ వద్దు



రాస్తారోకో చేస్తున్న మహిళలు

లేపాక్షి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కొడికొండ నుంచి శిర వరకు నిర్మిస్తున్న జాతీయరహదారి వెడల్పును బిసలమానేపల్లి గ్రామంలో మహిళలు బుధవారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. జాతీయ రహదారి వెడల్పులో భాగంగా బుధవారం ఎన్‌హెచ్ సర్వేయర్లు బిసలమానేపల్లిలో రోడ్డు వెడల్పు సర్వే నిర్వహించేందుకు వచ్చారు. మహిళలు సర్వేయర్లను అడ్డుకుని ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా పనులు చేపడతారని ధ్వజమెత్తారు. అనంతరం రహదారికి అడ్డంగా కూర్చుని ఇళ్లను కూల్చితే ఎలా బతకాలంటూ ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న సౌజన్యలక్ష్మి వారితో మాట్లాడారు. మీ ఇళ్లకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందని సర్దిచెప్పారు. దీంతో వారు శాంతించారు. పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

అమరాపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్నడుగు గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై కెనరాబ్యాంక్ మేనేజర్ సీఎఫ్‌ఎల్ కౌన్సిలర్ అశోక్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. మేనేజర్ సూర్యదేవనాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలన్నారు. నెలలో ఒక్కసారైనా ఖాతాలో లావాదేవీలు నడపడంతో డీయాక్టివేట్‌కాకుండా ఉంటుందన్నారు. ఇటీవల గ్రామంలోని వినోదమ్మ అనారోగ్యంతో మరణించడంతో నామినీగా ఉన్న భర్త శివన్నకు రూ.2లక్షల చెక్కును మేనేజర్ అందజేశారు.

సింగిల్ విండో అధ్యక్షుడికి సన్మానం

గోరంట్ల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌనివారిపల్లిలో సింగల్ విండో అధ్యక్షుడు శీనప్పపల్లి రవిమోహన్, గోరంట్ల ఏఎంసి వైస్ ఛైర్మన్ తిరుపాల్‌బాధ్యతలు స్వీరించడంతో బుధవారం వారిని సన్మానించారు. పంచాయతీకి చెందిన ఇద్దరికి పదవులు లభించడంపై ఎంపీటీఓ నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో శాలువల, పూలమాలలతో సత్కరించారు. గోరంట్లకు చెందిన ముస్లిం మైనార్టీలు రవిమోహన్, తిరుపాల్ ఇంటివద్దకు వెళ్లి సన్మానించారు. గ్రామ కార్యదర్శి మస్తాన్; సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు నాగభూషణ, శ్రీనివాసులు, అజంతుల్లా, నబీరసూల్, జిలాన్, ఉస్మాన్, హమానుల్లా, రఫీక్, నయాజ్, శ్రీనివాసులు, రోహిత పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయండి

పెనుకొండ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో 193 దివ్యాంగుల పింఛన్లు తొలగించారని, వారిలో ఎంతోమంది అర్హులున్నారని వారికి పింఛన్లు కొనసాగించాలని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. జిల్లా కార్యదర్శి హరి, సీఐటీయూ బాబావలి ఆధ్వర్యంలో పింఛన్లు తొలగించిన లబ్ధిదారులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయంలో నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అనర్హులను తొలగించి అర్హులకు పరీక్షలు నిర్వహించి పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పుట్టుకతో దివ్యాంగులైన వారి పింఛన్లు తొలగించడం అన్యాయమన్నారు. అలాంటివారికి వెంటనే పింఛన్ కొనసాగించాలన్నారు. అనంతరం ఎంపీడీఓ నరేష్‌కృష్ణకు వినతిపత్రం అందించారు.



ఎంపీడీఓ నరేష్ కృష్ణకు సమస్య వివరిస్తున్న సీపీఎం నాయకులు

ఆగిన దివ్యాంగుల పింఛన్లు

● పునఃపరిశీలనలో తొలగింపుపై లబ్ధిదారుల ఆందోళన



పట్టణంలోని 13వ వార్డులో నివాసమున్న 17ఏళ్ల నరేష్ అనే యువకుడికి 75శాతం వికలత్వం ఉంది. ఇంకో మనిషి ఉంటేతప్ప అడుగు ముందుకు వేయలేని పరిస్థితి. ట్రైసైకిల్ మీదే తిరగాల్సిన పరిస్థితి. పదేళ్లుగా పింఛన్ అందుకుంటున్నాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇతనికి దివ్యాంగ పింఛన్ రూ.6వేలు అందుతోంది. రెండు నెలల క్రితం వైద్య పరీక్షల ఆధారంగా పింఛన్ ఆపేసి నోటీసు ఇచ్చారు. దీంతో సదరు యువకుడు బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు.



30వ వార్డుకు చెందిన అఫ్రీన్ అనే చిన్నారికి వందశాతం వికలత్వం పింఛన్ అందుతోంది. గతంలో సదరం క్యాంపులో ధ్రువీకరణ పత్రం పొందారు. ఈ ప్రభుత్వం వచ్చాక కూడా పింఛన్ అందుతోంది. కానీ పునఃపరిశీలనలో రద్దయింది.



33వ వార్డుకు చెందిన మల్లికాబాను 90 శాతం మతిస్థిమితం లేనట్లు సర్టిఫికెట్ ఇచ్చారు. 2014నుంచి పింఛన్ అందుతోంది. పునఃపరిశీలనలో పింఛన్ ఆగిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ముక్కిడిపేటకు చెందిన జైనబ్ అనే చిన్నారికి దివ్యాంగుల పింఛన్ 2017నుంచి అందుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా రూ.6వేలు పింఛన్ ఇస్తున్నారు. కానీ పునఃపరిశీలనలో రద్దయింది.



సమస్యను మున్సిపల్ చైర్మన్‌కు వివరిస్తున్న బాధితులు

హిందూపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కొందరు అనర్హులు దివ్యాంగ పింఛన్లు పొందుతున్నారని భావించిన ప్రభుత్వం ఇటీవల పునర్‌పరిశీలన చేయించింది. ఈ క్రమంలో పలువురికి రద్దయినట్లు మూడ్రోజులుగా సచివాలయ సిబ్బంది నోటీసులు ఇస్తున్నారు. నిజమైన లబ్ధిదారుల పింఛన్లు రద్దుకావడంతో లబోదిబోమంటు మునిసిపల్ మండల కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. ఇలాంటి పింఛన్ వివరాలు అడిగిన వెంటనే అందుబాటులో ఉంచుకోవాలని సచివాలయ ఉద్యోగులకు అధికారులు ఆదేశిస్తున్నారు. హిందూపురం నియోజకవర్గంలో ఇలాంటి దివ్యాంగ పింఛన్ల రద్దుకు సంబంధించి నోటీసులు ఆయా సచివాలయ సిబ్బంది అందజేస్తున్నారు. వాటిని చూసిన లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. వందశాతం, 90శాతం, 70శాతం దివ్యాంగులైన వారికి కూడా పింఛన్లు రద్దుచేయడం ఏంటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్ని పింఛన్లు రద్దయ్యాయో సంఖ్య చెప్పలేదు.

అర్హత ఉన్నవారు ఆందోళన చెందవద్దు: రమేష్, మున్సిపల్ చైర్మన్

రాష్ట్ర ప్రభుత్వం కొంతమంది అనర్హులు పింఛన్లు పొందుతున్నారని పునఃపరిశీలన చేయించారు. అయితే కొన్ని సాంకేతిక పరమైన సమస్యలతో అర్హత ఉన్నవారు కూడా ఎక్కడైనా రద్దయి ఉంటే అలాంటివారు ఈనెల 25లోపు మునిసిపల్, ఎంపీడీఓ కార్యాలయాల్లో సర్టిఫికెట్లు అందజేస్తే కచ్చితంగా అర్హులకు పింఛన్ అందుతుంది. ఇందులో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బుధవారం కొంతమంది పింఛన్లు రద్దయిన లబ్ధిదారులు చైర్మన్‌ను కలిసిన సందర్భంగా చెప్పారు.

పింఛన్లు పునరుద్ధరించాలి



డిప్యూటీ ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న దివ్యాంగులు

గుడిబండ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ప్రభుత్వం వెరిఫికేషన్ పేర్లతో రద్దు చేసిన పింఛన్లను పునరుద్ధరించాలని కోరుతూ ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగరాజ్ నాయక్‌కు విన్నవించారు. బుధవారం దివ్యాంగులు ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయంలో వికలత్వపు సర్టిఫికెట్లు జారీచేసి పింఛన్లు అందించేవారని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అర్హులైన దివ్యాంగులను రీ వెరిఫికేషన్ పేరుతో పింఛన్లను నిలుపుదల చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. అనంతరం దివ్యాంగులు ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు.

ప్లాస్టిక్ వాడితే చర్యలు: కమిషనర్

మడకశిర టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవని నగర పంచాయతీ కమిషనర్ జగన్నాథ్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలో పలు దుకాణాలు, బేకరీలు, కూరగాయల మార్కెట్, హోటల్స్ తదితర ప్రాంతాలలో తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసమే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించామన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థలు వివరించారు. ప్లాస్టిక్ కవర్స్ బదులుగా పేపర్ బ్యాగులను, గుడ్డ సంచులను, పేపర్ గ్లాసులను, పేపర్ కప్పులను వినియోగించాలని సూచించారు.

చలివెందులలో పొలం పిలుస్తోంది

హిందూపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చలివెందుల వద్ద మొక్కజొన్న పంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. చలివెందుల, బాలంపల్లి గ్రామాల పరిధిలోని రైతులను పొలాల వద్దకు తీసుకెళ్లి అవగాహన కల్పించారు. ఏడీ కృష్ణయ్య మాట్లాడుతూ వ్యవసాయాధికారులు ఇచ్చే సూచనలు పాటించి రైతులు పంటలు సాగుచేయాలన్నారు. శాస్త్రవేత్త శ్రీనివాసాచారి, ఏఓ సురేంద్ర నాయక్, రైతు సేవా కేంద్రం సిబ్బంది సురేష్, గౌతమి, రవీంద్ర, రైతులు పాల్గొన్నారు.

'మత్తుకు బానిస కావద్దు'



విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గోరంట్ల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తుకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దని సీఐలు శేఖర్, గోపీనాథ్ సూచించారు. పట్టణంలోని ఎస్‌ఏపీఎస్ ఎయిడెడ్ జూనియర్, ఏఎన్‌కే డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థలపై బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐలు, ఈగల్ విభాగం అధికారులు, డ్రగ్స్, తాగుడు లాంటి మత్తుపదార్థాలకు బానిసలై సర్వనాశనమైన జీవితాలను ఉదాహరణలతో వివరించారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించి, డ్రగ్స్ వాడకం, కార్యకలాపాలను విద్యార్థులు 1972కు సమాచారం అందించాలని కోరారు. కరస్పాండెంట్ కెంపుల లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, అధ్యాపకులు రమేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

హిందూపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలు వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. ఆసక్తిగలవారు వేలంలో పాల్గొనవచ్చన్నారు. ఆధార్ జిరాక్స్ తీసుకురావాలన్నారు.

శిక్షణకు దరఖాస్తులు

పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నికల్ కళాశాలలో నిరుద్యోగ యువతీ యువకులకు మూడు నెలలపాటు ఉచిత బ్యూటీషియన్, కంప్యూటర్ కోచింగ్‌పై శిక్షణిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరిక్రిష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 18-35ఏళ్ల వయసున్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్నవారికి సర్టిఫికెట్లతోపాటు ఉపాధి కల్పిస్తామన్నారు. వివరాలకు 9676706976 నంబరును సంప్రదించాలన్నారు.

అడ్మిషన్లు ప్రారంభం

హిందూపురం ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సుల్లో మొదటి సంవత్సరం ప్రవేశం కోసం నోటిఫికేషన్లు విడుదలయ్యాయన్నారు. 20 నుంచి 26వ తేదీవరకు ఇంటర్‌పాసైన విద్యార్థులు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. వెబ్ ఆప్షన్లు 24నుంచి 28వరకు ఉంటాయన్నారు. సీట్ల కేటాయింపు 31న తెలియజేస్తారన్నారు. ఇతర వివరాల కోసం కళాశాల పనిదినాల్లో సంప్రదించాలన్నారు.

నేడు 'నాపట్టు.. నా అభిమానం'పై శిక్షణ

హిందూపురం, పట్టుగూళ్ల మార్కెట్‌లో గురువారం నాపట్టు నా అభిమానం కింద శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అనంతపురం ప్రాంతీయ పట్టుపరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమ్య ప్రకటనలో తెలిపారు. మార్కెట్‌లో పట్టు రైతుల కోసం కేంద్ర పట్టుమండలి ప్రారంభించిన నాపట్టు నా అభిమానం కింద శిక్షణ ఉంటుందన్నారు.

రేపు సినీనటుడు మంచు మనోజ్ రాక

అమరాపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి సిద్దేశ్వరస్వామిని దర్శించుకునేందుకు సినీనటుడు మోహన్ బాబు తనయుడు మంచు మనోజ్ శుక్రవారం వస్తున్నారని స్థానిక టీడీపీ నాయకులు తెలిపారు. వీరితోపాటు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కుమారస్వామి, రామచంద్రప్ప, కృష్ణమూర్తి, జయకుమార్ కోరారు.

నూతన బార్ పాలసీపై అవగాహన

పెనుకొండ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పెనుకొండ నగర పంచాయతీకి కేటాయించిన బార్‌కు సంబంధించి లైసెన్స్‌దారులు, ఔత్సాహికులతో ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య అవగాహన సదస్సు నిర్వహించారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో నగర పంచాయతీకి కేటాయించిన ఒక బార్‌కు సంబంధించి లైసెన్స్ దారుల సందేహాలను నివృత్తి చేశారు. ఎక్కువమంది పోటీపడాలని ఔత్సాహికులకు సూచించారు. డీసీతోపాటు ఏఈఎస్ నరసింహులు, పెనుకొండ ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

రొద్దం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన విధంగానే ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం కలిపి, రొప్పాల, చోళేమర్రి, నల్లూరు, పెద్దమంతూరు, రొద్దం పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మూల్యాంకన విధానాన్ని గతంలోమాదిరి అవలంబించి సరళతరం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుధాకర్, సత్యనారాయణరెడ్డి, విష్ణు, ముజఫర్‌హుస్సేన్, లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

'ప్రజారోగ్యానికి ప్రథమ శత్రువు దోమ'



హిందూపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హిందూపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రజల అనారోగ్యం బారిన పడ్డారంటే అందుకు కారణం దోమే ఉంటుందని వైద్యులు అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో దోమల నివారణ దినోత్సవం ఇర్వహించారు. మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ శివన్న మాట్లాడుతూ కనీసం రెండు మిల్లీ గ్రాముల బరువులేని దోమ నేడు ప్రపంచ ఆరోగ్య వ్యవస్థకే సవాల్ విసురుతోందన్నారు. దోమకాటుద్వారా ప్రపంచ వ్యాప్తంగా మిలియన్ సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయన్నారు. 2030నాటికి మలేరియా నిర్మూలనకు ప్రపంచ దేశాలు ప్రణాళికలు అమలు చేస్తున్నా మనవంతు వాటి నివారణకు సహకరించాలన్నారు. వైద్య సిబ్బంది రాఘవేంద్రనాయుడు, ప్రసాద్, సురేష్, ముస్తఫ, శీను, గోవిందరాజులు, విజయ్‌కుమార్, జైశీల, శేషు పాల్గొన్నారు.

సోమందేపల్లి: ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య బృందం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సాయినగర్, మండ్లి గ్రామంలోని ప్రభుత్వ బడుల్లో దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. వైద్యులు ఓంకార్ మాట్లాడుతూ దోమలు ప్రబలే అవకాశం వర్షాకాలంలో ఎక్కువగా ఉంటుందన్నారు. సూపర్‌వైజర్ రవీంద్ర, ప్రభాకర్‌రాజు, మాలతిదేవి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

గోరంట్ల: మండలంలోని ఖాజాపురం కేజీబీవీలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు మలేరియా అధికారులు బుధవారం అవగాహన కల్పించారు. మందపల్లిలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేపట్టారు. కేజీబీవీలో దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, చికున్ గున్యా తదితర వ్యాధుల గురించి వివరించారు. మలేరియా సూపర్‌వైజర్ గంగాధర్, వైద్య సిబ్బంది రంగనాథ్, శ్రీకాంత్, చెన్నారెడ్డి, చెన్నకేశవరెడ్డి, శిరీషా, ప్రమీల, షర్మిలా పాల్గొన్నారు.

మడకశిర రూరల్: దోమల నివారణతోనే వ్యాధులు దూరమవుతాయని కదిరేపల్లి పీహెచ్‌సీ వైద్యుడు నరేష్ కుమార్ అన్నారు. ప్రపంచ దోమలం నివారణ దినం సందర్భంగా బుధవారం ఎంజేపీ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ షమీవుల్లా, డాక్టర్ శృతి, ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.



మడకశిరలో మాట్లాడుతున్న డాక్టర్ నరేష్‌కుమార్

ఉచిత న్యాయసేవను పొందండి

● జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్



సబ్‌జైలును తనిఖీ చేస్తున్న న్యాయాధికారి రాజశేఖర్

హిందూపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అర్హత ఉండి న్యాయవాదులను పెట్టుకోలేనివారు ఉచిత న్యాయసేవ పొందవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక సబ్‌జైలును ఆయన తనిఖీ చేశారు. జైలులో రికార్డులు పరిశీలించి అక్కడున్న ఖైదీలతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎప్పటి నుంచి జైలులో ఉన్నారు, ఏం నేరం చేసి వచ్చారు, ములాఖత్‌కు సమయం ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. తరచూ న్యాయవాదులు, బంధువులతో మాట్లాడే అవకాశం ఇస్తున్నారా లేదా భోజన సౌకర్యాలపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి ఉంటే కోర్టు దృష్టికి తీసుకురావాలన్నారు. దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోపు ఉచిత సాయం కింద న్యాయవాదులను ఏర్పాటు చేస్తారన్నారు. ఇందుకోసం డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఎంతమంది దరఖాస్తు చేసుకుంటారో అర్హత ఉన్నవారందరికీ న్యాయవాదులు ఏర్పాటు చేస్తామన్నారు. జైలు గదులను పరిశీలించారు. జైలు అధికారి హనుమన్న, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఎరువుల కోసం ఎదురుచూపు

● అరకొర సరఫరాతో రైతుల ఆందోళన



సింగిల్‌విండో కార్యాలయం వద్ద ఎరువుల బస్తాలు అన్‌లోడ్ చేస్తున్న దృశ్యం

సోమందేపల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ప్రభుత్వం నుంచి సబ్సిడీ ఎరువులు అందకపోవడంతో రైతులు మార్కెట్‌లో అధిక ధరలకు ఎరువులు కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ప్రభుత్వం పంపిణీకి పూనుకోవడంతో రైతులకు ఊరట లభించింది. బుధవారం సింగిల్‌విండో కార్యాలయానికి ఎరువులు వస్తున్నాయన్న సమాచారం అందడంతో ఉదయమే రైతులు కార్యాలయం వద్దకు చేరుకుని పడిగాపులు కాశారు. అరకొరగా సరఫరా అవుతున్న ఎరువులు దొరుకుతాయోలేదోనన్న ఆందోళనతో కార్యాలయం వద్దబారులు తీరారు. సింగిల్‌విండో అధ్యక్షుడు పూలవెంటకేశులు మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం రైతులకు సరిపడా ఎరువులు సరఫరా చేస్తుందన్నారు. మొదటి విడతగా లోడు ఎరువులు అందించామన్నారు. బుధవారం వచ్చే లోడును గోడౌన్‌లో ఉంచి రైతులకు టోకెన్లు అందజేస్తామన్నారు. ఎరువులు కావాల్సిన రైతులు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్‌ను కార్యాలయానికి తీసుకురావాలన్నారు.

విద్యార్థులకు డైరీల పంపిణీ



డైరీలు పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు, టీడీపీ నాయకులు

పెనుకొండ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరుపున సభ్యులు, టీడీపీ నాయకులు డైరీలు పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న 8, 9, 10 తరగతి వీటిని పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో మాత్రమే విద్యార్థులకు డైరీలు పంపిణీ చేస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు డైరీలు లేక ఇబ్బందులు పడుతున్న విషయం గమనించిన మంత్రి సవిత ట్రస్ట్ తరుపున 10వేల డైరీలు పంపిణీ చేశారు. హెచ్ఎం శ్రీలత, ప్రధానోపాధ్యాయులు రామచంద్ర, ట్రస్ట్ సభ్యులు రామాంజనేయులు, శ్రీరాములు, బాబుల్‌రెడ్డి, త్రివేంద్ర, రమణమ్మ, మున్సిపల్ కౌన్సిలర్లు గిరి, హనుమంతు, సాయిప్రసాద్, అత్తర్‌ఖాదిర్, నరేంద్ర, సుబ్రహ్మణ్యం, పులగూర్ల శ్రీనివాసులు, బోయ నంజుండ, కురుబ నంజుండ, చంద్రాయుడు, మల్లికార్జున, బీజేపీ రామక్రిష్ణ, జనసేన శ్రీదేవి, అంద్రూస్ పాల్గొన్నారు.

విద్యార్థినుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఏపీసీ

రొద్దం, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): కేజీబీవీల్లో చదివే విద్యార్థులపట్ల ప్రిన్సిపాళ్లు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఎస్ఏ ఏపీసీ దేవరాజు సూచించారు. గురువారం బుక్కపట్నం ఎస్ఎస్ఏ ఆఫీస్ నుంచి జిల్లాలోని కేజీబీవీ ప్రిన్సిపాళ్లకు వెబెక్స్ ద్వారా విద్యార్థినుల ఆరోగ్య స్థితిగతులపై ఆరాతీశారు. ప్రతిరోజూ వేడిచేసి చల్లార్చిన నీటిని ఇవ్వాలన్నారు. నాణ్యమైన భోజనం అందించాలన్నారు. సోమందేపల్లి కేజీబీవీ ప్రిన్సిపాల్ అనితను అప్రమత్తంగా ఉండాలని ఏపీసీ హెచ్చరించారు. పాఠశాల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని వాటిని రాకుండా జాగ్రత్తపడాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం వ్యాక్సిన్‌లు వేయిస్తుందన్నారు. పాఠశాల నుంచి విద్యార్థులు బయటకు వెళ్లకుండా జాగ్రత్త వహించాలన్నారు. విద్యర్థులకు ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూసుకోవాలన్నారు. కొన్ని పాఠశాలలో ఊఎన్ఎంలు, పీఈటీలు నిర్లక్ష్యంగా ఉన్నారని, పద్ధతి మార్చుకోకపోతే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. సీసీడీఓ, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

భూగర్భజలం పెంపుపై అవగాహన

అమరాపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో చెరువు, సాగునీటి సంఘం పరిధిలో భూగర్భజలాలు పెంచడానికి కృషిచేయాలని ఎంపీడీఓ రామారావు పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 14 సాగునీటి సంఘాల అధ్యక్షులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ, ఏఈ భార్గవ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మండలంలోని ఇరిగేషన్ పరిధిలోని చెరువులు, చిన్నకుంటలు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం పరిధిలో రైతు పొలాల్లో ఉన్న చిన్న చిన్న కుంటల అభివృద్ధి పరచడానికి చర్యలు చేపట్టాలని ఏపీఓ శివన్న చెరువు సంఘాల అధ్యక్షుడు నరసింహమూర్తి, గురుసిద్దప్ప, తిప్పేస్వామి పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

రొళ్ల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయాన్ని బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ తనిఖీ చేశారు. గ్రంథాలయంలో పలు రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయ పన్ను వివరాలు ఇన్‌చార్జి అధికారి శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే వసూలు చేసేందుకు కృషిచేయాలని సూచించారు. సిబ్బంది గోపాల్‌రాజు పాల్గొన్నారు.